మార్చి - ఏప్రిల్ 2018

పరీక్షలు వచ్చేశాయ్!!

కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ మాసపత్రిక వెల రూ.30/-





సంపుటి: 4 సంచిక: 3 పుటలు: 68 విడి ప్రతి వెల: 30 రూ. మార్చి-ఏప్రియల్ 2018

Editor: Narayana Sarma

Owned, Printed and Published by:
Kottapalli Prachuranalu,
1-127/A, Near MRO Office,
Chennekothapalli,
Ananthapuramu District
Andhra Pradesh-515101
Website: http://kottapalli.in
Email: team@kottapalli.in
Phone: 7702877670

Printed at:
Mudrica Offset Printers,
Sanyasi Raju street,
Gandhi Nagar,
Vijayawada,
Andhrapradesh
Phone: 08662579129

RNI Registration No: APTEL/2014/62705
Postal Registration No: HDP/008/2018-2020

స్ఫూర్తి : యు. సుబ్బరాజు

సంపాదకులు: నారాయణ శర్మ

ప్రచురణ:

కొత్తపల్లి ప్రచురణలు, చెన్నేకొత్తపల్లి

యాజమాన్యం:

సత్య - ఫౌండేషన్ ఫర్ ఎ హెల్దీ సొసైటీ, చెన్నూరు.

చిత్రాలు:

అడవి రాముడు : 9491870753

రాధా స్కూల్ (అనంతపురం) లో చదివే పిల్లలు

వెబ్సైటు నిర్వహణ:

ఆనంద్, లక్ష్మి

వాణిజ్యం, మార్కెటింగు:

బి. అశోక్: 9963571510

కె. మల్లికార్జున: 9000453887



విషయ సూచిక



ముఖచిత్రం: పరీక్షలు!

చిత్రకారుడు: సి.రాము

కొత్తపల్లి 98 వ పుస్తకం!



దాక్షిణ్యం స్వజనే, దయా పరిజనే, శాఠ్యం సదా దుర్జనే,
ప్రీతి: సాధుజనే, నయో నృపజనే, విద్వజ్జనే చార్జవమ్ ।
శౌర్యం శత్రుజనే, క్షమా గురు జనే, కాంతాజనే ధృష్టతా,
యే చైవం పురుషా: కళాసు కుశలాస్తేష్వేవ లోక స్థితి: ॥

సంస్కృత మూలం
(భర్తృహరి)

తెలుగు అనుసరణ
(ఏనుగు లక్ష్మణ కవి)

వర కృప భృత్యులందు, నిజ సర్గమునందనుకూల వృత్తి, కా
పురుషులయందు శాఠ్యము, సుబుద్ధులయందనురక్తి, దాల్మి స-
ద్గురువులయందు, శౌర్యము మృగాక్షులయందు బ్రగల్భ భావ మీ
వరుస గళాప్రవీణులగు వారల యందు వసించు లోకముల్ ||

భావం: తనవారి పట్ల కృప, సేవించేవారి పట్ల దయ, చెడ్డవారి పట్ల కాఠిన్యము, మంచివారి పట్ల ఇష్టము, రాజుల పట్ల సాధుభావము, పండితులపట్ల అనురక్తి, సద్గురువులపట్ల ప్రేమ, శత్రువుల పట్ల శౌర్య వృత్తి, స్త్రీలపట్ల నిపుణత- వీటిని కలిగి ఉండే వారు కుశలురు. లోకం వారిని గౌరవిస్తుంది.

కలిసి బ్రతుకుదాం!

అనగనగా ఒక అడవిలో ఒక చీమ, మిడత, పేడపురుగు ఉండేవి.

చీమ, మిడత ప్రతిరోజూ కలిసి తిరిగేవి, వానాకాలం కోసం అవసరమైన ఆహారాన్నంతా ముందుగా సేకరించుకునేవి. చీమ ఆహారాన్ని వాసన పట్టి చూపించేది; మిడత దాన్ని తెచ్చి చీమ పుట్ట దగ్గర విడిచేది.



ఇక మిడత, పేడపురుగు రెండూ ప్రతిరోజూ కలిసి తిరిగి, ఎక్కడెక్కడి పాటలూ సేకరించుకొని పాడేవి. పేడపురుగు నోటితో తాళం పలికిస్తే, మిడత ఎగిరి గంతులు వేసేది. రెండూ సంతోషంగా బిగ్గరగా నవ్వుకునేవి.

ఎప్పుడో ఒకసారి ఈ మూడూ కలిసేవి. అట్లా కలిసినప్పుడు మరి పేడపురుగు, చీమ సరిగ్గా మాట్లాడుకునేవి కావు. ఒకదాన్ని చూసి ఒకటి ముఖం చిట్లించుకునేవి.


మిడత మటుకు వాళ్లిద్దరి ముఖాలకేసీ చూసి నవ్వేది.

"ఈ పేడ పురుగుకు పనిచేయటమే రాదు! ఎప్పుడూ ఆ పాటలేంటి?" అనేది చీమ ఆ తర్వాత. మిడత నవ్వేది- పేడపురుగును వెనకేసుకు వచ్చేది.

"ఈ చీమకి అస్సలు పాట అంటే ఏంటో తెలీదు! ఎప్పుడూ ఆ పనేంటి?" అనేది పేడపురుగు. మిడత నవ్వి, ఈసారి చీమను వెనకేసుకు వచ్చేది.

అంతలో వానాకాలం రానే వచ్చింది-

అడవిలో అంతటా నీళ్ళు, బురద! బయటికి వెళ్ళాలంటే కష్టం అయిపోయింది చీమకి. అది ఇంట్లోనే ఉండి, దాచుకున్న ఆహారంతోటే వంట చేసుకుని, అందులో తను కొంచెం తిని, కొంచెం మిడతకు కూడా పెట్టేది.



మిడత అట్లా తనకు చీమ ఇచ్చిన ఆహారంలోంచే కొంచెం తీసుకెళ్ళి పేడపురుగుకు పెట్టేది. అటుపైన రెండూ కలిసి బురదలోనే చక్కగా పాటలు పాడుకుంటూ తిరిగేవి. ఆ సమయంలో అవి సేకరించిన ఆహారంలో కొంత తీసుకెళ్ళి మళ్ళీ చీమకు పెట్టేది మిడత!

ఇట్లా రెండు మూడేళ్ళు గడిచేసరికి, చీమకు పేడ పురుగంటే గౌరవం పెరిగింది. పేడ పురుగుకు కూడా చీమంటే ప్రేమ కలిగింది.

"పేడపురుగు ఎంత బాగా పాడుతుందో కదా, ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటుంది!" అన్నది చీమ.

"చీమ ఎంత మంచిదో కదా, సంవత్సరమంతా శ్రమపడుతుంది- స్వార్థమే లేదు దానికి!" అన్నది పేడపురుగు.

అటుపైన మూడూ కలిసి సంవత్సరమంతా కచేరీలు చేసుకుంటూ, కలిసి ఆహారం సేకరించుకుంటూ, కలిసి తింటూ బ్రతికాయి.

మన సమాజం కూడా ఇలానే ఏర్పడింది అనిపిస్తుంది ఆలోచిస్తే. అందరమూ అన్ని సమయాల్లోనూ అన్ని పనులూ చెయ్యలేం కాబట్టి, ఎవరికి వీలైనట్లు వాళ్లం, ఎవరి శక్తికి తగినట్లు వాళ్లం, ఎవరి ఇష్టానికి తగినట్లు వాళ్లం- పనిచేసేందుకు అనువుగా ఈ వ్యవస్థల్ని ఏర్పరచుకున్నాం అనమాట. అయితే ఈ ఆదర్శాలు సరిగా పనిచేయాలంటే చీమలు,

పేడపురుగుల్లాగా తమ పనిని తాము ఇష్టంగా చేసే వాళ్ళు ఎంత ముఖ్యమో, మిడత లాగా అందరినీ కలుపుకు పోయే వాళ్ళు అంతకంటే ముఖ్యం.

ఇతరులు చేసే పనుల్లో మంచిని చూపించి, అందరూ కలిసిపోయేందుకు దార్లు వేసే ఇట్లాంటి మిడతలకు నమస్కరిస్తూ,



పిల్లలందరికీ పరీక్షల కాలపు శుభాకాంక్షలతో,

కొత్తపల్లి బృందం

సామెతలు

1. ముల్లును ముల్లుతోనే తీయాలి; వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి!
2. కంచు మ్రోగునట్లు కనకంబు మ్రోగునా?!
3. పిల్లికి చెలగాటం యెలుకకు ప్రాణ సంకటం!
4. వినశకాలే విపరీత బుద్ధి:!
5 . తనకోపమే తన శత్రువు!
6. మంచమున్నంత వరకు కాళ్ళు చాచుకో!
7. ఋణ శేషం శత్రు శేషం ఉంచరాదు!
8. తీగ లాగితే డొంక అంతా కదిలినట్లు!
9. కాకి ముక్కుకు దొండ పండు!
10. కంచే చేను మేసినట్లు!
11. పాము కాళ్ళు పాముకెరుక!

సేకరణ: బి అశోక్, చెన్నేకొత్తపల్లి





తాతయ్య డ్రగ్స్

బిట్టు కథలు

నేపథ్యం : ఢిల్లీలో ఉండే బిట్టు సెలవల్లో అమ్మమ్మ ఊరు పోరంకికి వచ్చాడు. తెలుగు ఇప్పుడిప్పుడే నేర్చుకుంటున్నాడు- అందుకని చాలా అనుమానాలు వస్తుంటాయి వాడికి. ఊళ్లో సైకిల్ రిపెయిర్ షాపు నడిపించే వీరబాబు కూతురి పిల్లలు దావీదు, చిట్టి వాడి స్నేహితులు. ఇక చదవండి...

రచన : శ్రీమతి అనురాధ నాదెళ్ళ, పోరంకి, విజయవాడ.

అర్థ రాత్రి అవుతుండగా బిట్టుకి మెలకువ వచ్చింది. చుట్టూ చూస్తే అందరూ నిద్రలో ఉన్నారు. వరండాలోకి వెళ్లి చప్పుడు చేయకుండా చూసాడు... రెయిన్బో కనిపించలేదు! "ఏమయ్యాడు వాడు?" అని ఒక్క నిముషం ఖంగారు పడినా, లోపలికి వచ్చి చూస్తే తాతయ్య మంచం క్రింద మరింత ముడుచుకుని పడుకుని ఉన్నాడు వాడు.

ఇంతలో ఎవరో దగ్గిన శబ్దం వినిపించింది బిట్టుకి. అందరివైపు చూసాడు. ఎవరూ కదల్లేదు.

తాతమ్మ గదిలోకి వెళ్లి చూసి వచ్చాడు. ఆవిడ నిద్రపోతోంది.. అంతలోనే మళ్ళీ శబ్దం

వచ్చింది...బయట వాన శబ్దంలోంచే.. నిద్రపోతున్నవాళ్లకి వినపడకపోయినా, మెల-కువగా ఉన్న బిట్టుకి తెలుస్తోంది.

శబ్దం ఇంటి ప్రక్కన ఉన్న సందులోంచి వస్తున్నట్లుంది... "ఎవరై ఉంటారు? ఏమి చెయ్యాలి?" అని ఆలోచించాడు. "తాతయ్యని కానీ, అమ్మమ్మని కానీ లేపాలా? తనే చూడాలా? లేక దావీదుని లేపాలా?" అని తేల్చుకోకుండానే టార్చి లైటు వేసి వాకిలి ముందు, పెరటి వైపు చూసాడు. ఎవరూ కనిపించలేదు. "సందులో సన్ షేడ్ లో ఎవరైనా వచ్చి నిలబడ్డారా? అక్కడ చూడాలంటే తలుపులు తాళం తియ్యాలి. ఎలా? చప్పుడైతే తాతయ్య లేస్తారేమో..."

నెమ్మదిగా దావీదుని లేపాడు. సైగలతో వరండాలోకి తీసుకొచ్చి గుసగుసలాడాడు. రెయిన్బోగాడు లేచాడు ఇంతలో. చిట్టి కదులుతోంది. రెయిన్బో గాడు ఎప్పుడూ అనవసరంగా అరవడు. అందులో అందరూ నిద్రపోతున్నప్పుడు. చిట్టి లేచి వరండాలోకి వచ్చింది. ఏమిటన్నట్టు సైగ చేసింది. చుట్టూ చూసి వీధి గేటు గడియ తీసి ఉందని గమనించింది. బిట్టు ఆశ్చర్య పోయాడు. తను కానీ, దావీదు కానీ గమనించనే లేదు. అందుకే అమ్మమ్మ చిట్టిని మెచ్చుకుంటూ ఉంటుంది. 'ఆడపిల్ల, అన్నీ వివరంగా చూస్తుంది' అంటూ. తమకి ఏదైనా పని అప్పజెప్తే చేసి వచ్చేస్తారు. కానీ చిట్టి మాత్రం ఆ పని పూర్తిగా చేసి చుట్టూ పరిసరాలు మరోసారి గమనించి మరీ వస్తుంది.


"అయితే ఎవరో ఇంట్లోకి వచ్చారన్న మాట. దొంగలేమో!" ఆ ఆలోచన బిట్టుకి భలే థ్రిల్ ని ఇచ్చింది. "సినిమాల్లో చూసినట్టు ఇప్పుడు తామంతా దొంగని పట్టుకుని పోలీసులకి అప్పగిస్తారా?"

గుసగుసగా అన్నాడు 'పోలీసులకి ఫోన్ చేద్దమా, దొంగ వచ్చాడు మన ఇంట్లోకి, అని?!' అంటూ.

చిట్టి తల అడ్డంగా ఊపింది. "వానలో దొంగ ఎందుకొస్తాడు? పట్టుబడితే వాడు పరుగెత్తాలన్నాకష్టమే కదా. ఎవరో వానలో తడిసి ఉంటారు, తల దాచుకోవటం కోసం

ఇంట్లోకి వచ్చి ఉంటారు" అంది. రెయిన్బో గాడికి ఏమర్థమైందో ఏమోగానీ తోక మాత్రం తెగ ఊపేస్తున్నాడు. అంతలోనే తాతయ్య లేచి వచ్చారు ఈ గుసగుసలకి. వస్తూనే వరండాలో లైటు వేసారు.

'ఏమిటర్రా, నిద్రపోకుండా ఏం చేస్తున్నారు మీరంతా ఇక్కడ?' అన్నారు.



'తాతయ్యా, ఎవరో గేటు తీసుకుని మన ఇంటి లోపలికి వచ్చారు. నేను దొంగ అంటుంటే చిట్టి మాత్రం ఒప్పుకోవట్లా. ఎవరో వాన వస్తోందని, నీడ కోసం లోపలికి వచ్చారని అంటోంది' అన్నాడు బిట్టు. తాతయ్య ఇంటి చుట్టూ లైట్లు వేసి వరండా తాళం తీసి, 'ఎవరదీ' అంటూ బయటకి నడిచారు. పిల్లలు, రెయిన్బో కూడా వెనకే వెళ్లారు.

ఎవరో ఒక అపరిచితుడు- యాభై ఏళ్లకు పైబడి ఉంటాయి- తలమీదుగా దుప్పటి ముక్క కప్పుకుని, చలికి వణుకుతూ, నిలబడి ఉన్నాడక్కడ: 'అయ్యా, తప్పైపోయింది! చలికి, వానకి తట్టుకోలేక గేటు తీసుకుని లోపలికి వచ్చాను. దొంగని కాదు బాబూ!' అన్నాడు దీనంగా.

తాతయ్య వెంటనే అతన్ని వరండాలోకి పిలిచి కూర్చోమని చెప్పి, లోపలికెళ్లి పాత పైజమా, చొక్కా తెచ్చి తొడుక్కోమని ఇచ్చారు. వంటింట్లోకెళ్లి అన్నం గిన్నె చూసి అన్నం, కూర తెచ్చి ఇచ్చి, వేడిగా టీ కూడా పెట్టి ఇచ్చారు.

బిట్టు ఇదంతా ఆశ్చర్యంగా చూస్తున్నాడు: రాత్రి పూట అందరూ నిద్రపోతుంటే గేటు తీసుకుని వచ్చి, సందు గుమ్మంలో షెడ్ క్రింద కూర్చున్న క్రొత్త మనిషిని, 'ఇట్లా లోపలికి ఎందుకు వచ్చావు?' అని కోప్పడకుండా,

అతని ఆకలిని పట్టించుకొని, అన్నం పెట్టి, పొడి బట్టలు ఇచ్చిన తాతయ్య- "బలే గొప్పవాడు కదా!" అనుకున్నాడు. "నేను కూడా అలా తాతయ్యలా గొప్పగా ఉండాలి!" అనుకున్నాడు.



తెల్లవారే సరికి తాతమ్మ కొంచెం కొంచెం దగ్గుతోంది. వాన తగ్గిపోయింది; అయినా కాస్త చల్లగా ఉన్నది వాతావరణం. అదే తాతమ్మకి దగ్గు తెప్పించినట్లుంది.

తాతయ్య ఆఫీసునుంచి వచ్చి 'అమ్మా, మిరియాల కషాయం త్రాగేవా?' అని అడిగేరు. 'తాగేనురా. ఉక్కిరిబిక్కిరి అయిపోయింది. ఏదైనా మాత్ర పట్టుకురా' అంది తాతమ్మ.

తాతయ్య సైకిల్ తీసేసరికి బిట్టు సిద్ధంగా ఉన్నాడు. తాతయ్యతోపాటు తనూ మందుల షాపుకి వస్తానని బయలుదేరాడు. తాతాయ్య షాపులోకి వెళ్లాక, బయట మెట్ల మీద నుంచుని చుట్టూతా చూసాడు. అటుపైన తలెత్తి షాపు పేరు చదివితే ఇంకేముంది- అమ్మో!! 'చిన్ని డ్రగ్ హౌస్' అని ఉంది!

"తాతయ్య ఆరోజు 'డ్రగ్స్ చెడ్డవి' అని చెప్పాడు కదా?! మరి ఇప్పుడు ఇక్కడ ఏదో కొంటున్నాడు ఏమిటి?" అని బిట్టుకి చాలా అనుమానం వచ్చింది.

అంతలోనే తాతయ్య దుకాణం నుండి ఏదో కొనుక్కొచ్చి 'పదరా' అన్నారు. వెంటనే బిట్టు 'తాతయ్యా, మీరు తెచ్చింది డ్రగ్సేనా?" అని అడిగాడు.

"అవును, తాతమ్మకోసం!" అన్నాడు తాతయ్య. 'ఎందుకు ఇలా అడుగుతున్నాడు?' అని ఆశ్చర్యపోతూ.

"వెంటనే ఆ డ్రగ్స్ తీసుకెళ్ళి దుకాణంలో వెనక్కి ఇచ్చెయ్ తాతయ్యా!' అన్నాడు బిట్టు సీరియస్‌గా. తాతయ్య తెల్లబోయాడు. 'ఏమైంది బిట్టూ?' అన్నాడు.



'తాతయ్యా, నువ్వు ఆరోజు ఏమి చెప్పేవు? 'డ్రగ్స్ చెడ్డవి' అన్నావా లేదా? ఇప్పుడేమో తాతమ్మకి డ్రగ్స్ కొంటున్నావా?' అన్నాడు బిట్టు అసహనంగా.

తాతయ్య పడీ పడీ నవ్వాడు: 'సారీ నాన్నా! అసలైతే 'డ్రగ్స్' అంటే 'మందులు' అని అర్థం రా. అంటే వాటిలో ఆరోగ్యానికి పనికొచ్చేవి కూడా ఉంటాయి: అవి 'మంచి డ్రగ్స్' అన్నమాట. ఆరోజు మనం మాట్లాడుకున్నవి మత్తు పదార్థాలు. అవి చాలా చెడ్డవి. వాటిని ఎవ్వరూ అమ్మకూడదు, కొనకూడదు. అయినా ప్రభుత్వానికి తెలీకుండా వాటిని అన్ని ఊళ్లల్లోనూ అమ్మేస్తూ నేరం చేసే వాళ్లు కొందరున్నారు.

పిల్లలు- పెద్దవాళ్లు కూడా, కొందరు వాటికి అలవాటు పడి, చదువులు, ఉద్యోగాలు మానేసి, మత్తులో పడి ఉంటున్నారు. ఆ మత్తులో నేరాలు చేస్తున్నారు. ఆ డ్రగ్స్ వేరురా, బిట్టూ!' వివరంగా చెప్పాడు తాతయ్య.

అప్పటికి గానీ బిట్టుకి సంగతులు సరిగా అర్థం కాలేదు. 'దాపీదుకి కూడా ఇన్ని సంగతులు తెలీదు. వాడికి ఈ వివరాలన్నీ చెప్పాలి' అనుకున్నాడు బిట్టు.

'తాతయ్యా, అమ్మమ్మకి మాత్రం చెప్పకేం, ఈ సంగతి?! 'ఇంకా తెలుగు రాలేదు' అని నన్ను వేళాకోళం చేస్తుంది' అన్నాడు బుంగమూతి పెట్టి. 'అలాగేలేరా, నీ రహస్యం కాపాడతానులే!' అన్నారు తాతయ్య నవ్వుతూ. ★



చిట్టిగాడి ఆకాశయానం

బొమ్మల కథ

రచన: వర్ష, 5 వ తరగతి, వికాసవిద్యావనం, పోరంకి, విజయవాడ.



చిట్టికి ఆకాశం అంటే ఇష్టం. అది ఎంత చక్కగా నీలం రంగులో ఉంటుందో అని ముచ్చట. ఆకాశంలో ఎగిరే పక్షులంటే ఆశ్చర్యం. 'మనం ఎగరలేమెందుకు?' అని ప్రశ్నలు. ఆకాశం గురించి తెలుసుకోవాలని బలే ఉబలాటం. అస్తమానూ వాళ్ళ అమ్మానాన్నల్ని ఆకాశం గురించి ఏదో ఒకటి అడుగుతూ ఉండేవాడు.

బడికి వెళ్ళి వచ్చాక, కాస్తంత ఏదైనా తిని, మళ్ళీ ఆడుకునేందుకు వెళ్ళేవాడు చిట్టి. ఒకసారి అట్లా ఆడుకుని వచ్చాడు. బాగా అలిసిపోయి ఉన్నాడేమో, వెంటనే నిద్రపట్టేసింది.



ఆ వెంటనే వాడు అంతరిక్ష యాత్రకు బయలుదేరాడు. ఎగిరేటప్పుడు మొదట్లో వాడికి రెక్కలు లేవు. కానీ ఒకసారి ఎగిరి మబ్బులలోకి వెళ్తుండగానే వాడికి మబ్బుల్లాంటి రెక్కలు మొలిచాయి. అవి వాడిని ఇంకా పైపైకి తీసుకువెళ్ళాయి.

అట్లా పోతుంటే వాడికి కొంగల్లాగా తెల్లటి రెక్కలు పెట్టుకున్న పక్షులు కలిసి ఎగురుతూ కనపడ్డాయి. చిట్టి వాటి రెక్కలు పట్టుకుని చూశాడు. మెత్తని దూదిలాగా అనిపించినై, అవి.

అంతలో వాడి వెనకనుండి నీలం రంగు పక్షులు దూసుకువచ్చాయి. 'ఇదేమి కొత్త పక్షి?!' అన్నట్లు, అవి వాడి వంక కోపంగా చూశాయి.



అంతలోనే ఉన్నట్టుండి చిట్టిగాడి శరీరం మరింత తేలికగా అయిపోయింది. 'ఏమిటా' అని చూసుకుంటే వాడి రెక్కలు ఇంకా పెద్దవి అయ్యాయి. ఇప్పుడు రెక్కలు కొంచెం ఊపితే చాలు- చాలా పైకి వెళ్ళిపోతున్నాడు. అట్లా పోతుంటే వాడికి తనలాగే ఎగురుతున్న పెట్టెలు కొన్ని కనిపించాయి. అవి బంగారపు రంగులో మెరుస్తున్నాయి. చిట్టిగాడికి ఆశ్చర్యం వేసింది.

'పెట్టెలు ఎగరటం ఏంటి? వాటిలో ఏముందో మరి, చూడాలి' అనుకున్నాడు. కానీ ఎంత

ప్రయత్నించినా వాటి మూతలు తెరుచుకోలేదు.



అంతలోనే వాడికి కొంచెం చలి వేయటం మొదలు పెట్టింది. ఒకసారి వణికిపోయాడు; కానీ 'లేదు, అంతరిక్షంలో చలికి తట్టుకోవాలి' అనుకోగానే ఇంక చలి వేయలేదు. అంతలోనే పెద్దగా శబ్దం చేసుకుంటూ ఓ విమానం అటుగా వచ్చింది. 'అది తనని గుద్దుతుందేమో' అని చిట్టిగాడు భయపడ్డాడు కానీ అది చాలా దూరంనుండే మరొక వైపుకు తిరిగి వెళ్ళిపోయింది. చిట్టి "హమ్మయ్య" అని ఊపిరి పీల్చుకున్నాడు.

అప్పుడు వాడు ఉన్న ఆ స్థలం ఏదో తెలిసిన చోటు లాగా అనిపించింది. చూస్తే ఎదురుగుండానే ఇంద్రధనస్సు! వాడికి చాలా సంతోషం వేసింది. వేగం తగ్గించి, ఆ రంగుల ప్రపంచంలోకి దూరాడు. చూస్తూండగానే ఏడు రంగులూ ఒకదాని తర్వాత ఒకటి వాడి మీద కురిసాయి. ఏడేడు రంగులూ వాడికి అంటుకున్నాయి. "అయ్యో, ఈ రంగులు మళ్ళీ వదులుతాయో, వదలవో" అని నవ్వాడు వాడు. అంతలోనే నెమ్మదిగా వర్షం మొదలయ్యింది. వాడి మీద కురిసిన రంగులన్నీ ఆ వర్షపు నీళ్లలో కొట్టుకుపోయాయి. కానీ ఏమంటే వాడు తడిసి ముద్దయ్యాడు.

ఇంకాస్త పైకి ఎగిరేసరికి, వర్షం కాస్తా ఆగిపోయింది. అయితే వాడికి ఇప్పుడు ఒంటరిగా అనిపించసాగింది: "నాతోపాటు నా స్నేహితులు కూడా ఉంటే బాగుండేది" అనుకున్నాడు "మేమందరం కలిసి బంతి ఆట ఆడుకునేవాళ్ళం.. సరే, ఇంక ఎంత సేపని వెళ్తాను ఇట్లా?

ఇంటికి వెళ్ళిపోతాను. అమ్మవాళ్ళు వెతుక్కుంటూ ఉంటారు" అనిపించింది వాడికి.

"సరే" అని కిందికి చూస్తే ఎక్కడా ఒక్క ఇల్లుకూడా లేదు! "ఎటువైపు పోవాలి ఇప్పుడు?!" అని ఆందోళన మొదలైంది. తికమక మొదలైంది. అయితే సరిగ్గా అదే సమయానికి నెమ్మదిగా వెలుగు మొదలైంది. ఏవేవో శబ్దాలు వచ్చాయి: "ఒరే చిట్టీ! లెగరా చిట్టీ!" అంటూ, వాళ్ళ అమ్మ గొంతుతోటే.



కళ్ళు తెరిచి చూస్తే అమ్మే. నిద్ర లేపుతున్నది: "లేరా చిట్టీ, ఎంతో సేపటినుంచి లేపుతున్నా నిన్ను" అంటూ.

చటుక్కున లేచి గడియారం కేసి చూసి "అమ్మో! ఆలస్యం అయిపోయింది" అంటూ బాత్ రూం వైపుకు పరుగు పెట్టాడు చిట్టి.

చిలిపి ప్రశ్నలు

1. తాగలేని రసం ఏమిటి?
2. బస్సులో ఎంతమంది కూర్చోవచ్చు?
3. నారి లేని విల్లు ఏమిటి?
4. ఆటలు ఆడని ప్లేయర్?!
5. డ్రైవర్ లేని బస్ ఏది?
6.రాయి నీళ్ళలో వేస్తే ఎందుకు మునిగిపోతుంది?

జవాబులు:

1. పాదరసం
2. పట్టినంత మంది
3. హరివిల్లు
4. సీడీ ప్లేయర్
5. సిలబస్
6. ఈత రాదు కాబట్టి



రంగుల సీతాకోక చిలుక

నిజమా ?! సీతాకోక చిలుకకి రంగులు ఇట్లాగేనా, వచ్చింది?!

రచన : యశోకృష్ణ, 6 వ తరగతి, క్రాస్‌వర్డ్ స్కూల్,గుంటూరు

అనగనగా ఓ చిట్టి సీతాకోక చిలుక ఉండేది. ఆ రోజుల్లో సీతాకోక చిలుకలకు రంగులుండేవి కాదు.

అందుకనో, ఏమో, మరి దానికి చాలా ప్రశ్నలు ఉండేవి.

అప్పట్లో ఎప్పుడో ఓసారి తను గూట్లో పడుకొని నిద్రపోయింది కదా, ఆ తర్వాత ఇట్లా రెక్కలతో నిద్రలేచింది. నిద్రలేచేసరికి చూస్తే చుట్టూతా ఎవ్వరూ లేరు. అయినా దానికి ఏమీ భయం వెయ్యలేదు! అది అట్లానే ఎగురుకుంటూ పోయి, తనలాగే రంగుల్లేని ఓ పెద్ద సీతాకోక చిలుకని కలుసుకున్నది.

"నువ్వేనా, మా అమ్మవి?" అని అడిగింది దాన్ని.

అది నవ్వింది.

"నేను అప్పట్లో ఎప్పుడో గుడ్లు పెట్టాను. ఆ గుడ్లలోంచి చిన్నచిన్న పురుగులు వచ్చాయి. చిన్న పురుగులు బాగా ఆకులు అలములు తిని, పెద్దయ్యాయి.



నేను చూస్తూండగానే అవన్నీ గూడు కట్టుకొని నిద్రపోయాయి. నాకు అంతవరకే తెలుసు" అన్నది.

"అయితే నువ్వేలే, మా అమ్మవి! నేను ఆ గూట్లోంచి ఇవాళ్ళే బయటికి వచ్చాను" అన్నది చిట్టి సీతాకోక చిలుక.

"ఓహో! అవునా! బాగుంది బాగుంది. సరే, మరి నీకు ఇప్పుడు ఆకలి వేస్తోందా? పూలమీద వాలి, నీ తొండంతో మకరందాన్ని త్రాగు! కడుపు నిండుతుంది" చూపించింది అమ్మ, ఓ పువ్వు మీద వాలుతూ.

కడుపునిండా మకరందం త్రాగాక సీతాకోక చిలుకకు హాయిగా అనిపించింది. కొంచెం కొంచెంగా నిద్ర కూడా వచ్చింది.

"వాతావరణం మారిపోయింది. వాన వస్తుందేమో! ఈ ఆకుల పొద క్రింది వైపున- ఇదిగో- పొడిగా ఉంది చూసావా? ఇక్కడ పడుకో, జాగ్రత్తగా. వానలో తడవకు! ప్రమాదం" జాగ్రత్తలు చెప్పింది పెద్ద సీతాకోక చిలుక.

కొద్ది సేపటికి ఉరుములు, మెరుపులతోటి పెద్దవాన మొదలైంది. చిట్టి సీతాకోక చిలుక కదలకుండా అక్కడే కూర్చుని, వాన ముగిసే వరకూ చూసింది. పెద్ద సీతాకోక చిలుక దాని ప్రక్కనే వాలి, కలగంటున్నట్లు మాట్లాడింది: "చాలా పైకి వెళ్తే స్వర్గం అనే చోటు ఉంటుందట. స్వర్గానికి రాజు ఇంద్రుడు. ఆ రాజుకి మెరుపుల వర్షం అంటే చాలా

ఇష్టమట.



అట్లా వర్షం వచ్చినప్పుడు ఆయన తన ధనస్సును ఈ భూమి మీదికి వదులుతాడు. నేను కూడా చూసాను- దానికి బలే రంగులు ఉంటాయి!" చెప్పింది.

"ఆ రంగులన్నీ మనకి ఉంటే?.. ఎంత బాగుంటుందో!" అనుకున్నది చిట్టి సీతాకోక చిలుక. కానీ ఆ మాటని అది పైకి అనలేదు.

అంతలో వాన వెలిసింది. సన్నగా తుంపర మాత్రం పడుతున్నది. అంతలో ఆకాశం నిండా ఇంద్రధనస్సు విరిసింది.

పిల్ల సీతాకోక చిలుక ఇంక ఆగలేక పోయింది. చటుక్కున ఎగిరింది. పెద్ద సీతాకోకచిలుక వారిస్తున్నా వినకుండా ఎత్తుకు, ఇంకా ఎత్తుకు-చివరికి ఇంద్రధనస్సును చేరుకునేంత వరకూ- ఎగురుతూ పోయింది. ఇంద్రధనస్సును తడుముతూ, మురిసిపోతూ "ఇంద్ర-ధనస్సూ! ఇంద్రధనస్సూ! నువ్వింత అందమైనదానివని అనుకోలేదు. నాకు నీ రంగులు కొద్దిగా ఇవ్వరాదా? ప్లీజ్!" అని ప్రాధేయపడింది.



ఇంద్రధనస్సుకి దాని ప్రేమ, అమాయకత్వం చూసి బలే ముద్దొచ్చింది.

"సరేలే! నామీద వాలి, బాగా పొర్లు. ఎన్ని రంగులు కావాలో అన్నీ తీసుకో!" అనేసింది.

ఇంకేముంది, సీతాకోకచిలుక ఇంద్రధనస్సు మీద పొర్లింది; రంగులు రంగులుగా మారిపోయింది! ఆ వెంటనే వానజల్లుతో చుక్కల డిజైన్ కూడా వేయించుకున్నది!

ఇక ఆనాటి నుండీ ప్రపంచంలో సీతాకోక చిలుకలన్నిటికీ రంగులు వచ్చేసాయి!

ఓ మాట...

కొత్తపల్లిలో పిల్లల రచనలకు ప్రాధాన్యత ఉంటుంది. ఈ పుస్తకంలో దాదాపు సగం కథలు పిల్లలు రాసినవి; మిగిలినవి పిల్లలకోసం పెద్దలు రాసినవి. ఈసారైతే బొమ్మలు వేసిన వాళ్ళు కూడా పిల్లలే! వాళ్లంతా అనంతపురం రాధా స్కూల్‌లో ఏడు-ఎనిమిది-తొమ్మిదో తరగతులు చదువుతున్నారు. అట్లాగ, అనుకుంటే మీరూ బొమ్మలు వేయచ్చు; మీరూ కథలు రాయచ్చు!

పిల్లలను కలవటం, వాళ్ల చేత తెలుగులో కథలు రాయించటం, బొమ్మలు వేయించటం, వాళ్ళు పంపిన కథల్ని, బొమ్మల్ని సరిదిద్ది మిగతా పిల్లలందరికీ నచ్చేట్లు పుస్తకాలుగా తయారు చేయటం, దానికోసం ఓపెన్ సోర్సు ఉపకరణాలను వాడటం, కథల్ని అందరూ ఉచితంగా చదువుకునేట్లు ఇంటర్నెట్‌లో పెట్టటంతోపాటు, కొన్ని ప్రతులు అచ్చు వేసి, ఇష్టపడిన వాళ్లకు అందించటం మాకు ఇష్టం.

ఈ పనులన్నీ ఎందుకు? ఎందుకంటే ఇవి అందరికీ మేలు చేస్తాయి కాబట్టి! ఇట్లా అందరి మేలూ కోరి చేసే పనుల్లో మీ శక్తి కొద్దీ మీరూ పాలుపంచుకోండి. బాగా చదవండి! బాగా గీయండి! బాగా రాయండి! నవ్వండి! ఆలోచించండి! చక్కగా పాడండి! మంచి పౌరులుగా ఎదగండి!

పిల్లల కథల ప్రపంచానికి స్వాగతం !



స్నేహ ధర్మం

కొన్ని రకాల కథలతో సినిమాలు, సీరియళ్ళు తీయచ్చు. ఇదిగో, అట్లాంటి ఓ కథ.. 🙂

రచన: పల్ల సాయి కిరణ్, 8 వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.



అనగనగా ఒక ఊళ్ళో రాజు, రవి అనే మిత్రులు ఇద్దరు ఉండే వాళ్ళు. చిన్ననాటి నుండి ఇద్దరూ కలిసి తిరిగేవాళ్ళు, కలిసి చదివేవాళ్ళు, ఏ పని చేసినా ఇద్దరూ కలిసి చేసేవాళ్ళు.

పెద్దవుతున్న కొద్దీ ఇద్దరి మీదా బాధ్యతలు పడ్డాయి. బ్రతుకు తెరువుగా రాజు కిరాణా

దుకాణం పెట్టుకున్నాడు; రవి బట్టల వ్యాపారం పెట్టుకున్నాడు. ఇద్దరికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. "వ్యాపారాలు బాగానే సాగుతున్నాయి" అనుకునేసరికల్లా, బట్టల వ్యాపారంలో నష్టాలు మొదలయ్యాయి రవికి.

"ఆదాయం తక్కువైంది; అప్పులు ఎక్కువయ్యాయి- అప్పులవాళ్ళు ఇంటి మీదికి వస్తున్నారు!" అని విచారపడుతున్న రవిని ఓదార్చాడు రాజు:

"దుకాణం అమ్మేసెయ్యి. వచ్చిన డబ్బుతో అప్పులన్నీ తీర్చెయ్యచ్చు. 'ఆ తర్వాత ఏం చేయాలి' అనేది మళ్ళీ చూసుకుందాం" అన్నాడు.

దుకాణాన్ని అమ్మాక, అప్పులన్నీ తీర్చగా ఇంకొన్ని డబ్బులు మాత్రం మిగిలాయి రవి దగ్గర. రాజు వాటికి సమానం మొత్తాన్ని తన వంతుగా తీసి ఇస్తూ, "నీ డబ్బులతోబాటు దీన్నీ పెట్టుబడిగా పెట్టి, పట్నంలో, ఈసారి కూడా బట్టల వ్యాపారమే కొత్తగా మొదలెట్టు. ఇప్పుడు ఇంక అన్నీ లాభాలే వస్తాయిలే; మేలవుతుంది" అని ప్రోత్సహించాడు.

"ఇప్పటికే ఊరంతా అప్పులంటే, పైన ఇంకా నీకు కూడా అప్పు పడమంటావా? ఏం వద్దు!" అన్నాడు రవి.

"నేను నీకు ఇస్తున్నది అప్పుగా కాదు. స్నేహితుల మధ్య అప్పులు ఉండవు. ఈ డబ్బుల్ని నువ్వు నాకు తిరిగి ఇవ్వనక్కర్లేదు" అంటూ బలవంతంగా ఆ డబ్బుల్ని రవి జేబులో పెట్టి, స్నేహితుడిని పట్నం పంపాడు రాజు.

పట్నంలో రవి బట్టల వ్యాపారం బాగానే నడిచింది. మిత్రులిద్దరి మధ్యా కొంత కాలం పాటు ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా చక్కగా నడిచాయి. ఆపైన మెల్లగా అవీ తగ్గాయి; చివరికి పూర్తిగా ఆగాయి; ఎవరి జీవితం వారిదైంది.

రాజుది సంతృప్తి కరమైన జీవితం. కానీ పెద్దగా ఎదుగుదల లేదు. రాజు భార్యకు ఏమంత చదువు రాదు. పల్లెటూరు మనిషి.

వాళ్ల కొడుకు శివ పల్లెలోనే చదివాడు.

రవి మటుకు కొన్నేళ్ళకు ధనవంతుడు అయ్యాడు. అయితే మళ్ళీ ఏనాడూ అతను ఊరికి రాలేదు; ఊరి గురించి తలుచుకోలేదు. రవి భార్య ఇంగ్లీషు నేర్చుకున్నది. కొడుకు పట్నంలో చదవటం మొదలెట్టాడు.



అంతలోనే అనుకోని సంఘటన ఒకటి జరిగింది. పల్లెలో ఉండే రాజు అకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు. కుటుంబానికి దిక్కు లేకుండా అయ్యింది.

రాజు కుటుంబం కిరాణా దుకాణాన్ని అమ్మేసి, పట్నం చేరుకున్నది. అక్కడ రాజు భార్య శాంతమ్మ ఒక కంపెనీలో పని చేసుకుంటూ, కొడుకు శివని చదివించసాగింది. పట్నంలోనే ఉన్న రాముకు ఆ సంగతి తెలీదు.

కాలేజీలో చేరిన కొత్తల్లో శివ దగ్గర అసలు ఏమాత్రం డబ్బులు ఉండేవి కావు. అప్పుడొకసారి కాలేజీ ఫీజు కట్టటం ఆలస్యమైనప్పుడు, వాళ్ల తరగతిలోనే చదివే రమేష్ వాడికి సాయం చేసాడు. రమేష్ వాళ్ల నాన్న పేరున్న పెద్ద వ్యాపారి. త్వరలోనే శివ రమేష్ ఇద్దరూ మంచి మిత్రులయ్యారు. ఇద్దరూ ఒకరి ఇంటికొకరు అనేకసార్లు వెళ్ళి వచ్చేవాళ్ళు; కలిసి చదివేవాళ్ళు.

ఆ సంవత్సరం రమేష్ పుట్టిన రోజు పార్టీ ఇస్తూ, శాంతమ్మని కూడా గట్టిగా ఆహ్వానించాడు. సరేనని శివ, శాంతమ్మ ఇద్దరూ రమేష్ వాళ్ల ఇంటికి వెళ్ళారు.

అక్కడ రమేష్ వాళ్లకి తన తల్లిదండ్రుల్ని పరిచయం చేయబోయాడు- కానీ ఆ సరికే వాళ్ళు శాంతమ్మని చూసి నిశ్చేష్టులైపోయి ఉన్నారు! రమేష్ వేరెవరో కాదు- రాము

కొడుకే!

రాము, అతని భార్య వంగి శాంతమ్మ కాళ్లకి నమస్కరించి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నారు.



'రాజుకి ఇలా అయిందని మాకు తెలీనే లేదు' అని నొచ్చుకున్నారు. "రమేష్ మా రాజు కొడుకేననమాట! పులికి పులి బిడ్డ పుట్టింది" అని మెచ్చుకున్నాడు రాము.

"నీకు తెలుసుకదా వదినా, నా వ్యాపారానికి సగం పెట్టుబడి రాజుదే. రాజు మంచితనం వల్ల, దేవుడి దయవల్ల నా వ్యాపారం ఇలా సాగుతున్నది. నేను ఏనాడో భాగాలు పంచి ఉన్నాను- ఈ ఆస్తిలో సగం వాటా మా రాజుదీ-మీది!" అంటూ పత్రాలను తెచ్చి శాంతమ్మ ముందుంచాడు రాము.

చూస్తున్న శివ, రమేష్‌లకు అసంకల్పితంగానే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ★

పొడుపు కథలు:

1. బంగారు భరిణిలో రత్నాలు.. పగలగొడితే కానీ బయటకు రావు. ఏంటవి?!

2. మూడు కళ్ళుంటాయి కానీ శివుడు కాదు. ఎవరది?!

3. పొట్టలో వేలు- నెత్తి మీద రాయి. ఏంటబ్బా అది?!

4. తెల్లని పోలీసుకు నల్లని టోపీ. ఏంటది?!

5. ముగ్గురు అన్నదమ్ములకు ఒకటే టోపీ. ఎక్కడుంటుంది?

జవాబులు: 1. దానిమ్మ గింజ, 2. టెంకాయ, 3. ఉంగరం, 4. అగ్గిపుల్ల, 5. తాటికాయ



శ్రమ ఫలితం

అప్పట్లో ఎవరో ఇంగ్లీషు వాళ్ళు కనుక్కున్నారు- ఏనుగులు కాలవలు త్రవ్వే సంగతిని. అప్పటినుండి అది నిత్యనూతనంగా మళ్ళీ మళ్ళీ వస్తూనే ఉంది చూడండి...

రచన : కిరణ్ కుమార్, 9 వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోగిర

కంబాలపల్లి ప్రాంతంలో పెద్ద అడవి ఒకటి ఉండేది. అనేక పక్షులు, జంతువులు ఆ అడవిలో సంతోషంగా జీవించేవి. ఆ అడవి అందాన్ని మాటల్లో చెప్పలేం. పూల మొక్కలు, గడ్డి మొక్కలు, కాయలతోటీ, పళ్ళతోటీ తులతూగే పచ్చని చెట్లు...


అయితే ఒకసారి వరసగా రెండేళ్లపాటు వానలు పడలేదు. దాంతో అడవి మొత్తం చిన్నబోయింది. కరువు తాకిడికి అడవిలో ఉన్న పక్షులు, జంతువులు అన్నీ విలవిలలాడిపోయాయి. పెద్ద పెద్ద చెట్లే ఎండిపోతున్నాయంటే, ఇక చిన్న మొక్కల గురించి చెప్పేదేమున్నది?!



జంతువులన్నీ వేటికవి వానదేవుడిని ప్రార్థించాయి. "నాదేమీ లేదు, నేను ఇదివరకటిలాగానే వస్తున్నానుగానీ, గాలి నన్ను సరిగా కురవనీయట్లేదు. వచ్చిన మబ్బునల్లా ఎగరేసుకు పోతున్నది!" అన్నాడు వానదేవుడు.

అవకాశం ఉన్న జంతువులు గాలిదేవుడిని అడిగాయి. "లేదే, నేనూ ఇదివరకటిలాగానే వీస్తున్నాను.. అడవి అవతల మనుషులు ఏమైనా చేస్తున్నారేమో" అన్నాడు వాయుదేవుడు.

జంతువులకు ఏం చేయాలో తోచలేదు. చివరికి అవి అన్నీ కలిసి మాట్లాడుకున్నాయి.



"ఇంతకుముందు మన అడవిలోంచి చాలా ఏర్లు పారేవి. అన్నీ మన అడవిలోని నీళ్లను నదిలోకి తీసుకెళ్లేవే. అయితే నా చిన్నప్పుడు ఓసారి ఇట్లాగే పెద్ద కరువు వచ్చింది. అప్పుడు ఏనుగులు ఆ ఏర్లు పారకుండా అడ్డు గోడలు కట్టినై. దాంతో ఆ అడ్డుకట్టల వెనక నీళ్ళు నిలిచి, మడుగులు ఏర్పడ్డాయి " చెప్పింది ఒక ముసలి తాబేలు.

"ఎప్పటి సంగతో చెబుతావెందుకు? ప్రస్తుతం ఆ మడుగులు అన్నీ ఎండిపోయినై, పైగా ఏ ఏరులోనూ చుక్క నీళ్ళు లేవు! ఇప్పుడేం చేయాలో అది చెప్పు!" అన్నదొక కోతి అసహనంగా.

"అదే చెబుతున్నాను. అప్పట్లో మనవాళ్లంతా కలిసి ఇంకో పని చేసారు.



నదినుండి అడవిలోపలి వరకూ ఓ కాలవను త్రవ్వారు. అయితే రాను రాను మనుషులు ఇసకను త్రవ్వుకెళ్లటంతో ఆ నది మట్టంకూడా బాగా తగ్గిపోయింది. ఇప్పుడు మన కాలవే నది కంటే ఎత్తులో ఉంది, వృధాగా, ఎండిపోయి! కాబట్టి ఇప్పుడు మీరంతా పూనుకొని, ఆ కాలవ పూడిక తీయండి. దాని లోతు పెంచారంటే, నదిలో ఉండే కాసిని నీళ్ళూ ఇటు అడవిలోకి వస్తాయి; మన కష్టాలు తీరతాయి" చెప్పింది తాబేలు.

"అవునవును. ఇదేదో బాగుంది. నిజానికి మనకు వేరే మార్గం కూడా ఏదీ లేదు.. ఎవరు చేయగలిగినంత పని వాళ్ళు చేయటమే!" అన్నాయి చాలా జంతువులు.



దాంతో ఏనుగుల నాయకత్వాన జంతువులన్నీ కాలవను లోతు చేసే పని మొదలు పెట్టుకున్నాయి. ఎలుకలు సొరంగాలు త్రవ్వాయి. అడవి పందులు నేలను గుల్ల గుల్ల చేసాయి. గాడిదలు బరువులు మోసాయి. ఏనుగులు పెద్ద పెద్ద రాళ్ళను తొలగించటమే కాక, పని చేస్తున్న జంతువులన్నిటికీ నది నుండి తెచ్చిన నీళ్లను అందించాయి.

చివరికి వాటి కృషి ఫలించింది. నదిలోంచి నీళ్ళు కాలవలోకి ప్రవహించాయి. అడవి మధ్యలో పెద్ద జలాశయం కూడా ఒకటి తయారయింది. నీళ్ళ కష్టాలు తీరాయి.

ఆ తరువాత జంతువులన్నీ అడవి చట్టాన్ని జారీ చేశాయి: "మనం ఏ అడవిపై ఆధారపడతామో ఆ అడవిని సంరక్షించుకునే బాధ్యత మనది. ఈ చట్టాన్ని పాటించే జంతువులు జీవిస్తాయి. పాటించనివి మరణిస్తాయి" అని.

రౌడీ తెలివి!



టీచర్: ఓరేయ్ టింకూ....! 8 లో సగం ఎంతరా...?

రౌడీ టింకూ: అడ్డంగా నరికితే 0; నిలువుగా నరికితే 3 సార్..!!

టీచర్: నిన్ను బాగు చేయటం నాతరం కాదురా..

గొప్పాయన!

వెంగళప్ప: నీకు ఎన్ని సార్లు చెప్పాలి మొబైల్ చూస్తూ వంట చేయొద్దని? చారులో ఉప్పు, పులుపు ఏమీ లేదు..

కాంతం: నేను ఎన్నిసార్లు చెప్పాలి మొబైల్ చూస్తూ అన్నం తినద్దని? మీరు అన్నంలో కలుపుకున్నది చారు కాదు.. నీళ్ళు...!


రేపటి ప్లానింగు

రాజు: అనిల్ .. నాకు పదిరూపాయలు కావాలి ఇవ్వురా; రేపు తిరిగి ఇచ్చేస్తాను.

అనిల్: ఇప్పుడు లేవురా. రేపు తీసుకో.

రాజు: ఇప్పుడు లేకపోతే మరి రేపు ఎట్లా ఇస్తావురా?

అనిల్: రేపు నువ్వే ఇస్తానన్నావుగా, నీ దగ్గర తీసుకొని నీకు ఇచ్చేస్తా....!!!



నక్క బుద్ధి

రచన: మండ్లి నవీన్, 7 వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోగిర



అనగనగా ఒక అడవిలో చాలా జంతువులు ఉండేవి. ఏనుగు, కుందేలు, జింక- ఇట్లా జంతువులు అన్నీ కలిసి మెలిసి ఉండేవి. కష్టసుఖాల్లో ఒకదానికొకటి తోడుగా ఉంటూ సంతోషంగా జీవించేవి. కానీ నక్కమాత్రం వాటితో పూర్తిగా కలిసేది కాదు. ఒక్కోసారి తన మోస పూరిత బుద్ధిని ప్రదర్శిస్తూ ఉండేది.

ఒక రోజున ఎప్పటి మాదిరే ఆహారం వెతుక్కుంటూ ఉన్న ఏనుగుకు ఒక పెద్ద నిధి

దొరికింది.

వెంటనే అది ఆ సంగతి మిగిలిన జంతువు-లన్నిటికీ చెప్పి, "దీని ఫలితం అందరికీ లభించాలి- దీన్ని అందరం పంచుకుందామా, ఒకచోట ఉంచి సరిగా నిర్వహించుకుందామా మీరే చెప్పండి" అన్నది. జంతువులన్నీ దాన్ని మెచ్చుకొని, 'ఇది నీకే దొరికింది గనక, దీని నిర్వహణ కూడా నువ్వే చెయ్యి' అన్నాయి.

అయితే అక్కడే కూర్చున్న నక్కకి ఇది అస్సలు నచ్చలేదు. అయినా అది బయట పడకుండా ఊరుకొని, ఆపైన దానికే చిలవలు పలవలు అల్లి, సంగతిని సింహం చెవిన వేసింది.

"మరైతే మనకు ఏ ఏ జంతువులు సహకరిస్తాయి?" అడిగింది సింహం.

"అందరినీ ఏనుగు తన వశం చేసుకున్నది ప్రభూ. దాని మాయలో పడిన జంతువులేవీ మనమాట వినవు. ఆ ఏనుగు కూడా అందరినీ కూడగట్టి అడవికి రాజు అవుదామని అనుకుంటున్నట్లుంది" అంటూ దాన్ని మరింత ఉసిగొల్పింది నక్క.

"మరి ఇప్పుడు ఏం చేద్దామంటావు?" అడిగింది సింహం.


నక్క దానికి ఓ పథకం చెప్పింది. ప్రతిరోజూ మేత కోసమని ఏనుగు ఒక దారి వెంబడి పోతుంది. ఆ దారిలో లోతైన గుంత ఒకటి త్రవ్వి, ఆకులు అలములతో కప్పి పెట్టాలి. ఏనుగు ఆ గుంతలో పడగానే వాటికి నిప్పంటించాలి" అని. సింహం అందుకు సరేనని తల ఊపింది.



అయితే సరిగ్గా ఆ సమయానికే అనుకోకుండా అటువైపుగా వెళ్తున్న కుందేలు, జింక ఆ మాటలు విన్నాయి.

వెంటనే చెంగు చెంగున గెంతుతూ వెళ్ళి, ఆ సంగతి ఏనుగుకు చెప్పి, "జాగ్రత్త బాబూ! ఈ నక్క మామూలుది కాదు.

ఒకసారి కాకపోతే మరోసారి అయినా నీ ప్రాణం మీదికి తెస్తుంది" అన్నాయి.



"అయ్యో! నాకు ఏమీ పాలుపోవటం లేదే! ఏం చెయ్యను?!" అన్నది ఏనుగు.

"నువ్వేం చేయనక్కర్లేదు- మేం ఉన్నాంగా?" అని జంతువులన్నీ కలిసి వెతికాయి. సింహము, నక్క త్రవ్విన గుంత ఎక్కడుందో కనుక్కొని, దాన్ని పూడ్చివేసాయి. బదులుగా నక్క తిరిగే దారిలో గోతిని ఒకదాన్ని తీసి, అందులో ఒక ఇనప బోనును కూడా తెచ్చిపెట్టి, అది అందులో పడటంకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాయి.

ఏనుగు పని ఐపోయిందనుకుంటూ వచ్చి దబుక్కున గోతిలో పడిపోయింది నక్క. రెండు రోజుల తర్వాత జంతువులన్నీ దాన్ని బయటికి తీసాయిగానీ, అది ఇంక స్నేహితులకు ముఖం చూపించలేక, చిక్కి శల్యమై చివరికి చనిపోయింది.

సింహం కూడా అసలు సంగతి తెలుసుకొని, ఆ దుర్మార్గపు నక్కతో చేతులు కలిపినందుకు పశ్చాత్తాపపడింది.



ఆటు తర్వాత నిధిని చక్కగా వాడుకొని, జంతువులన్నీ మెరుగైన సౌకర్యాలతో సుఖంగా జీవించాయి. ★



రైతు కష్టాలు

రచన: సాముల శ్రీకాంత్ రెడ్డి, 10 వ తరగతి, తేజ విద్యాలయ, కోదాడ, నల్గొండ జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

రామాపురంలో సోమయ్య అనే రైతు ఉండేవాడు. అతని భార్య పేరు లక్ష్మమ్మ. అతనికి ఇద్దరు కూతుళ్ళు. సోమయ్యకి ఎనిమిది ఎకరాల భూమి ఉంది. ఆ భూమిలో బంగారు పంటలు పండించవచ్చు. కానీ ఏం లాభం?! ఊళ్ళో త్రాగేందుకు సరిపడ నీళ్ళే లేవు- ఇంక పొలాలకు నీళ్ళెక్కడివి? కరువుకు తట్టుకోలేక ఊళ్ళో రైతులు చాలామంది పట్నానికి వలస పోయారు. కానీ సోమయ్య మాత్రం అక్కడినుండి కదలలేదు. ఏ రైతుకూ తను పెంచిన ఊరిని, తిండి పెట్టిన పొలాన్ని విడిచి ఎక్కడికీ పోవాలని ఉండదు. ప్రతి సంవత్సరం నష్టాలు వచ్చి, వచ్చి పాపం, సోమయ్య కాస్తా పేదవాడైనాడు.

సోమయ్యకి 'పొలంలో బోరు వేద్దాం' అని

ఆలోచన వచ్చింది. 'బోరులో నీళ్ళు పడ్డాయంటే ఇక ఈ నష్టాలు ఉండవు!'

అయితే అతని దగ్గర బోరుకు సరిపడ డబ్బు లేవు. దాంతో కొంత పొలాన్ని తాకట్టు పెట్టి, జమీందారు దగ్గర అప్పు తీసుకున్నాడు. అప్పు సొమ్ముతో బోరు వేయింవాడు; కానీ తనకి అదృష్టం లేదు- బోరులో నీళ్ళు పడలేదు. భూగర్భజలాలు ఇంకిపోయాయి. సోమయ్య చాలా బాధ పడ్డాడు.



ఇక ఆ సంవత్సరం తక్కువ నీళ్లతో పెరుగుతుంది కదా అని పత్తి పంట వేశాడు. పత్తి బాగానే పెరిగింది.

కానీ పంట చేతికి వచ్చే సమయానికి, ఎండిన పొలంలో నిప్పు రాజుకొని, పంట మొత్తం బూడిదైపోయింది. ఆ బాధకి సోమయ్య పాపం, వారం రోజులపాటు అన్నం తినలేదు.

ఆ తరువాతి సంవత్సరం అతను మిరప పంట వేశాడు. పెట్టుబడికోసం మళ్ళీ జమీందారు దగ్గర అప్పు తీసుకున్నాడు. కొన్ని రోజులు గడిచే సరికి, గడ్డి దొరకని ఆవులన్నీ పంటమీద పడి నాశనం చేశాయి. పెట్టుబడి మొత్తం నష్టమైంది.

"ఈసారి పంటలు వేయద్దు. నీకు వ్యవసాయం అచ్చిరాలేదు" చెప్పారు అందరూ.

కానీ సోమయ్య చెయ్యి ఊరుకోలేదు. ఈసారి అతను ప్రక్క పొలం వాళ్ళతో మాట్లాడుకొని, సగం తోటలో వరి మడి నాటాడు. వరికి నీళ్ళు చాలా అవసరం. "అసలే వానలు లేవు- వరి ఎందుకు వేస్తావు?" అని తిట్టారు అందరూ. వాళ్ళు అన్నట్లుగానే పొలం మంచిగా పండలేదు. పొలంలో చల్లేందుకు బయటినుంచి అప్పుపెట్టి మందులు తెచ్చాడు.

మళ్ళీ ఓసారి జమీందారును డబ్బులు అప్పు అడిగాడు. కూతుర్లకి స్కూలు ఫీజు కట్టాలి...

"ఇక తట్టుకోలేను" అనుకున్నాడు. పొలంకోసం తెచ్చిన పురుగుమందులను తాగేద్దామని నిశ్చయించుకున్నాడు.



అంతలో అకస్మాత్తుగా మేఘాలు క్రమ్ముకున్నాయి. 'ఢమ!... ఢమ!...' అంటూ ఉరుములు, మెరుపులు మొదలయ్యాయి. ఆకాశానికి చిల్లులు పడ్డట్లు వానలు కురిసాయి. వాగులు, వంకలు పారాయి. చెరువులన్నీ నిండాయి. ఇక బాధ లేదు. అప్పులు అన్నీ తీరిపోయాయి.

అయితే అప్పుడు వానలు పడకపోయి ఉంటే ఏమయ్యేది? సోమయ్య పురుగుమందుకు బలైపోయేవాడు! అతని కుటుంబం మొత్తం కష్టాలపాలయ్యేది!

వ్యవసాయంలో ప్రధాన సమస్య ప్రకృతి వైపరీత్యాలు. గాలి ఎక్కువ వచ్చినా, తక్కువ వచ్చినా; వాన ఎక్కువ వచ్చినా,తగ్గినా; ఎండ ఎక్కువ వచ్చినా, తగ్గినా- ఏమాత్రం తేడా వచ్చినా పంటలు పండవు. దానిమీద ఆధారపడిన రైతు పరిస్థితి గాలిలో పెట్టిన దీపం. ఇన్ని వ్యయ ప్రయాసలకు ఓర్చి రైతులు పండించిన పంటల్ని తిని దేశం అంతా బ్రతుకుతున్నది. అందుకని ఆహార పదార్థాలని వృధా చేయకూడదు. దాన్ని పండించిన రైతు శ్రమని అందరమూ అర్థం చేసుకోవాలి.

ప్రకృతి సమస్యల వల్ల రైతులకు నష్టాలు

రాకుండా వ్యవస్థల్ని ఏర్పరచాలి. ప్రధానంగా సాగునీటి సమస్యల్ని దూరం చేసేందుకు చెరువులు, వాగులు, వంకల్ని సరిచేసి, నీటికోతని నివారించే చర్యలు చేపట్టి, వాననీటిని ఆపే ఏర్పాట్లు చేయాలి. అన్నదాతకు భద్రత కల్పించవలసిన బాధ్యత మనందరిమీదా ఉన్నది!

పద్యం

అనగననగ రాగమతిశయిల్లుచు నుండు
తినగ తినగ వేము తియ్యనుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభి రామ వినురవేమ


భావము: ఓ వేమా! అదే పనిగా పాడుతూ ఉంటే రాగం మెరుగవుతూ ఉంటుంది. అదే పనిగా తింటూ ఉంటే వేపాకు కూడా తియ్యగా ఉంటుంది. అదే విధంగా అభ్యాసం వలన ఏ పనులైనా సాధ్యమౌతాయి. కాబట్టి నిరంతరంగా కృషి చేయడం ఎంతైనా అవసరం. అలాంటి కృషి వల్లనే సత్ఫలితాలు వస్తాయి.

చిలిపి ప్రశ్నలు

1. ఆఫ్రికా గిరిజనులు అరటిపండు ఎలా తింటారు?
2. కొబ్బరికాయని పగలుకొట్టకుండా ఎలా తినగలం?
3. హుస్సేన్ సాగర్‌లో బుద్ధుడు ఒక చేతిని పైకి ఎత్తి ఉంటాడు ఎందుకు?
4. నిద్రలో మంచం మీదనుంచి కిందపడితే ఏమౌతుంది?
5. రోడ్డుపై స్పీడ్ బ్రేకర్ లు ఎందుకు పెడతారు?

సేకరణ: బి. అశోక్, చెన్నేకొత్తపల్లి

జవాబులు: 1. ఒలుచుకుని, 2. రాత్రి కొట్టి తినవచ్చు, 3. కింద నీరు పెరిగితే పైకి పోతారని చెప్పేందుకు, 4. మెలకువ వస్తుంది, 5. డ్రైవర్ని నిద్రలేపడానికి.



నక్క-పంది

రచన: వివేక్, 5 వ తరగతి, వికాస విద్యావనం, పోరంకి, విజయవాడ.

అనగనగా ఒక అడవిలో ఇద్దరు మిత్రులు ఉండేవి: ఒకటేమో పంది, రెండవదేమో నక్క.

ఒకరోజున రెండూ కలిసి బయట మాట్లాడుకుంటూ ఉన్నాయి. అంతలో అకస్మాత్తుగా పొదల్లోనుంచి పంది మీదికి దూకింది, ఒక చిరుతపులి!

అది నేరుగా పంది మెడను పట్టుకొని కొరికి చంపెయ్యబోయింది.

అంతలో నక్క చిరుతపులిని వారిస్తూ "చూడు మామా! నీకు ఆకలి వేస్తూన్నది; అయినా కొంచెం మెదడును ఉపయోగించు. ఈ పంది చాలా శుభ్రంగా ఉంది- చూసావు గదా. కానీ అసలు పందులంటే ఎలా ఉండాలి? మురికిగా ఉండాలి. శుభ్రంగా ఉండే పందులు రుచిగా ఉండవు. అందుకని ఆ తినేదేదో దీన్ని బురదలో దొర్లించి తిను!

చాలా రుచిగా ఉంటుంది" అని చెప్పింది.

"ఓహో! అట్లాగా!" అని చిరుతపులి పందిని ఆ ప్రక్కనే ఉన్న బురదగుంతలోకి తీసుకు పోయింది- దొర్లించడానికి. నక్క సైగల్ని అర్థం చేసుకున్న పంది, చిరుతపులి తనని బురదలో పడేసేంత వరకూ కదలకుండా ఊరుకొని, ఒకసారి బురదలో పడగానే రెండు కాళ్ళతోటీ టపటపా తన్ని, బురదనంతా చిరుతపులి ముఖాన పడేట్లు కొట్టింది. ఆ వెంటనే అది తుడుచుకునేలోగా తను మురికి గుంతలోంచి ఈదుకుంటూ అవతలి ఒడ్డుకు చేరుకుని, ఇక వెనక్కి తిరిగి చూడకుండా పారిపోయింది.

"అయ్యో! మోసపోయానే!" అని నిట్టూరింది పులి.

***

తర్వాత కొన్ని రోజులకు, ఓసారి పంది బురదగుంతలో మునిగి తేలి, సంతోషంగా కళ్ళు మూసుకున్నప్పుడు, అప్పుడే దాన్ని చూసిన చిరుతపులి గబాలున వచ్చి, దాన్ని టక్కున నోట కరచుకున్నది. "ఇప్పుడు దొరికావు. బురద బురదగా ఉన్నావు. చాలా రుచిగా ఉంటావు!" అన్నది పళ్ళు నూరుతూ.

"అయ్యో! మామా! ఇవి ఇప్పుడు ఏం రోజులు? అమావాస్య రోజులు! అమావాస్య రోజుల్లో బురదపందిని తిన్నవాళ్ళు పాతాళానికే పోతారు. నన్ను బాగా కడుక్కొని తిను, కావాలంటే" అన్నది తెలివి మీరిన పంది, దానితో.



"అవునా?! అట్లాగా?!" అని, చిరుతపులి దాన్ని నోట కరచుకొని, పారుతున్న వంకలోకి పోయింది. అక్కడ దాన్ని వదలకుండానే శుభ్రంగా కడిగింది. అటుపైన దాన్ని నీళ్లలోనే తినబోయింది.

సరిగ్గా ఆ సమయానికి అటుగా వచ్చిన నక్క దాన్ని చూసి "హలో! మామా! ఆ పందిని ఎండబెట్టు! వెంటనే! ప్రమాదం!!" అని అరిచింది గట్టిగా.

"ఎందుకు?" అన్నది పులి, ఒకింత అనుమానంగా.



"అమావాస్య రోజుల్లో తడి పందిని తిన్నవాళ్ళు మూడు రోజుల్లో జరం వచ్చి పోతారని వినలేదా, నువ్వు?!" అన్నది నక్క సీరియస్‌గా ముఖం పెట్టుకొని.

"లేదే?!" అన్నది పులి.

"నిజం! కావాలంటే సాంబుడిని అడుగు- ముందు దీన్ని ఎండలో వెయ్యి. నువ్వు ఆ ప్రక్కనే నిలబడి ఉంటావు కదా, అది ఎక్కడికి పోతుంది? కావాలంటే దాని పొట్టమీద నీ పంజా వేసి పెట్టు!" అన్నది నక్క తెలివిగా.

'సరే' అని పందిని నేలమీద పడేసి, తన పంజాని దాని పొట్టమీద వేసుకొని నిలబడ్డది పులి.

అట్లా కొంచెం సేపు ఆగి, తను కొంచెం ఆరుతూనే, పులి పంజాని పట్టుకొని చక్కలిగిలి పెట్టేసింది పంది, పులి చక్కలిగిలికి తట్టుకోలేక 'కికికి' అంటూ విరగబడగానే, చటుక్కున లేచి ఇంటికి పరుగుపెట్టింది, 'బ్రతుకు జీవుడా' అంటూ!

మరోసారి మోసపోయిన పులికి తను ఎవరివల్ల మోసపోయిందీ అర్థమే కాలేదు!

రాము: అదేమిటి? అలా కూర్చున్నావ్? *సేకరణ : మల్లి, సి కె పల్లి*

సోము: నువ్వేగా రాయిలా కుర్చోమన్నావ్..

రాము: అయ్యో! నేను రాయిలా కూర్చోమనలేదు.. రా, యిలా కూర్చో అన్నా!!



సాహసం

"మారు ఆలోచన లేకుండా ఇతరులకు సాయం చేయగల్గటం చాలా గొప్ప సంగతి" అంటూ ఈ కథని రాసి పంపింది వర్షిత. నిజంగానే ఇది పెద్ద సాహసం.. అమ్మో!

రచన :వర్షిత, 5 వ తరగతి, వికాస విద్యావనం



అది ఒక తాండా. తాండాలో అందరూ ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటూ ఉన్నారు.

అది వేసవి కాలం. ఎప్పటి లాగే మగవాళ్ళు అంతా బయటి పనులకు వెళ్ళి ఉన్నారు. వడగాలులు బాగా వీస్తున్నాయి.

అంతలోనే ఎక్కడో నిప్పు రవ్వలు లేచాయి.

అంతే- తాండాలోని నాలుగైదు గుడిసెలు ఒక్కసారిగా అంటుకున్నాయి. గుడిసెలలో

ఉన్న వాళ్లంతా భయంతో గబగబా బయటకు పరుగు పెట్టారు.

గుడిసెముందు తొక్కుడు బిళ్ళ ఆడుకుంటోంది లచ్చిమి. ఈ మంటల్లో వాళ్ళ గుడిసె కూడా అంటుకున్నది.

లచ్చిమి వెనక్కి తిరిగి చూసేసరికి మంటలు పెద్దవయ్యాయి. ఒక్క క్షణం పాటు ఆ పాపకు ఏమీ అర్థం కాలేదు.



మరుక్షణంలో తమ్ముడు సోము గుర్తుకు వచ్చాడు. వాడు ఇంట్లో ఉయ్యాలలో పడుకొని నిద్రపోతున్నాడు! వాడికి ఇంకా ఉయ్యాల దిగటమే రాదు. అమ్మ-నాన్నలు వాడిని తనమీద వదిలి పనులకు వెళ్ళారు!!

లచ్చిమి తటాలున లేచి గుడిసెలోకి పరుగెత్త బోయింది. బయట మూగిన జనం హాహా కారాలు చేసారు. "లోపలికి పోవద్దు- ప్రమాదం" అని అరిచారు.

కానీ లచ్చిమి భయపడలేదు. తనకు ఏమైతుందో తను అస్సలు ఆలోచించలేదు. "చిట్టి తమ్ముడికి ఏమీ కాకూడదు" అనేది ఒక్కటే ఆ పాప ఆలోచన.

చటుక్కున లోపలికి దూరిన లచ్చిమి గబగబా ఉయ్యాలలోంచి సోమును ఎత్తుకుని అదే పరుగున బయటికి వచ్చింది.

ఆ సరికే లచ్చిమి పరికిణీకి నిప్పు అంటుకున్నది. చుట్టు ప్రక్కల వాళ్ళు గబగబా ఆ మంటను ఆర్పేసారు.

'ఇంకాస్త ఆలస్యమైతే మంటల్లో చిక్కుకు పోయేవాళ్ళు. అయినా అంత సాహసం ఎలా వచ్చింది పాపా, నీకు? ప్రమాదం కాదూ?!" అంటూనే అందరూ లచ్చిమి సాహసాన్ని కొనియాడారు.

బొమ్మకు కథ రాయండి

ఈ బొమ్మను చూడండి. ఏనుగు, పాప ఇద్దరూ ఆకాశపు అంచున, రాళ్ల గోడమీద కూర్చొని ఏం చెప్పుకుంటున్నారో మరి? దీన్ని చూస్తే మా మనసులో చాలా ఆలోచనలు గింగిరాలు తిరిగాయి. మరి మీకు? వీళ్ళిద్దరూ ఇట్లా ఎందుకు కూర్చున్నారో, ఆ కథ ఏంటో ఊహించి, చక్కగా రాసి పంపండి మాకు. ఆ కథల్లో బాగున్నవాటిని కొత్తపల్లి-100 వ పుస్తకంలో ప్రచురిస్తాం!



కొత్తపల్లి ప్రచురణలు, 1-127/A, MRO ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి , అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్-515101.



ఎవరు దాత?

రచన : సుదర్శన్, పీలేరు, చిత్తూరు జిల్లా.

రామచంద్రాపురంలో రామయ్య, సోమయ్య అనే ధనిక రైతులు ఇద్దరు వుండే వాళ్ళు. ఇద్దరూ మంచి వాళ్ళు; తమకు చేతనైనంత వరకూ ఇతరులకు సాయం చేసేవాళ్ళు. అందరూ వాళ్ల దాతృత్వం గురించి గొప్పగా చెప్పుకునేవాళ్ళు.

ప్రతి సంవత్సరమూ పంట కోతలకు ముందు, గ్రామదేవతలకు ప్రీతిగా అక్కడ ఒక జాతర జరుగుతుంది.

ప్రతిసారి లాగానే ఈసారి కూడ రామయ్య, సోమయ్య ఇద్దరూ జాతరకోసం భూరి విరాళం ఇచ్చారు. ఆ సమయంలో గ్రామ దేవతలకు వీళ్లిద్దరిలో నిజంగా ఎవరు గొప్పవాళ్ళో కనుక్కోవాలని ఒక కోరిక

కలిగింది. ఆ సమయానికి కోతలు అయ్యి రామయ్య, సోమయ్య పంటలు చేనులో ఉన్నాయి. వీళ్లని పరీక్షిద్దామనుకున్న గ్రామదేవతలు ఆ పంట మొత్తాన్నీ మాయం చేసేసారు.

చేతికి అంది వచ్చిన పంటని 'దొంగలు ఎత్తుకెళ్ళారు' అనుకున్నారు ఇద్దరూ. 'ఇలా జరిగిందేమి?' అని నిండా విచారంలో మునిగి ఉన్నాడు సోమయ్య. అతను ఇంకా ఆ బాధలో ఉండగానే పొరుగూరు నుండి రైతులు కొందరు వచ్చారు. "అయ్యా! ప్రతి ఏడాదీ తమరు ఇచ్చే ధాన్యం పుణ్యాన మా ఊళ్ళో ముసలివారికి అన్నదానం జరుగుతున్నది. ఈసారి తమరి పంట చేతికి అందలేదని తెలిసింది. ఈ కార్యక్రమం మరి ఎలా జరపాలో తెలీకుండా ఉంది" అని బాధ వ్యక్తం చేసారు. సోమయ్య తన అశక్తతని చెబుతూ "ఈసారికి కుదరదు. అన్నీ అనుకూలిస్తే, వచ్చే ఏడాది ఏమైనా సాయం చేస్తాను" అని చెప్పేసాడు వాళ్లకు.

వాళ్ళు నిరాశగా బయటికి వచ్చి, సాయాన్ని అపేక్షిస్తూ రామయ్య ఇంటికి పోయారు. రామయ్యకు కూడా పంట చేతికి అందలేదన్న బాధ ఉండింది కానీ, ముందు అనుకున్న ప్రకారం అతను ఇంట్లో పూజా కార్యక్రమం ఒకటి పెట్టుకున్నాడు; దానికి ఊళ్ళో వాళ్లను అందరినీ భోజనానికి పిలిచి ఉన్నాడు.

ఆ సమయంలో వీళ్ళు వచ్చి సాయం అడిగితే "అన్ని ఖర్చుల్లో ఇదీ ఒక ఖర్చు.. కానివ్వండి.



ఎలాగో ఒకలాగా మీకు అయిదారు నెలలకు సరిపడా ధాన్యం ఇస్తాను; రబీ పంటలోంచి

మిగతాది చూద్దాం. ముందైతే మీరంతా భోజనం చేసి వెళ్ళండి!" అన్నాడతను.

ఇంట్లో వాళ్ళు ఆ సరికే సైగలు చేస్తున్నారు- "ఇంకా వంట పూర్తవలేదు" అని. "దానిదేముంది, ఏముంటే అది పెట్టండి" అంటూ దేవుడికోసం ప్రత్యేకంగా చేసిన వంటకాలను తెప్పించి వాళ్లకు పెట్టి, తృప్తిగా సాగనంపాడు రామయ్య.

ఆ తర్వాత గ్రామదేవతలే మారువేషంలో వచ్చి "రామయ్యా! దేవుడికి చేసిన వంటలు తెచ్చి ఎవరికో పెట్టేసావే, దేవుడంటే అంత తిరస్కారం అయితే ఎలాగ?" అన్నారు.

"అయ్యో, తిరస్కారం ఏమీ లేదు. వాళ్ళని చూస్తే పాపం ఆకలిమీద ఉన్నారని తెలుస్తూనే ఉంది. దేవుడిని ఆకలితో పంపితే ఎలాగ అని, ఆయనకోసం చేసినవి ఆయనకే ఇచ్చాను" అన్నాడు రామయ్య.

లేమిలో కూడా దానశీలతను నిలుపుకునేందుకు ప్రయత్నిస్తున్న రామయ్యని మెచ్చుకున్న గ్రామదేవతలు నవ్వి, "నువ్వు ఎలాంటివాడివో తెలుసు-కుందామని, ఇట్లా ఓ పరీక్ష పెట్టాము. నీ ధాన్యమూ, సోమయ్య ధాన్యమూ ఎక్కడికీ పోలేదు. మీ గాదెల్లోకే చేరి భద్రంగా ఉంది. సోమయ్యకు కూడా చెప్పు- మీరు ఇద్దరూ మీరు చేసే మంచిపనుల్ని కొనసాగించండి. మంచి పనులు చేసేటప్పుడు కూడా "నేను" అన్న అహంకారపు భావన రాకుండా చూసుకోండి. మీకు మేలవుతుంది" అంటూ మాయం అయిపోయారు.

తప్పులెన్నువారు తండోపతండంబు
లుర్వి జనులకెల్ల నుండు తప్పు
తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ!

ఓ వేమా! తప్పులు ఎంచేవాళ్ళు లోకంలో కొల్లలుగా ఉంటారు. నిజానికి ఈ ప్రపంచంలో వెతికితే తప్పులేనివాడంటూ దొరకడు. అయినా తప్పులెంచేవాళ్లకు తాము చేసే తప్పులు మాత్రం తెలియవు.





హంస కథ

పద్య చమత్కారం

కథనం : శ్రీ ఇ.యస్.వి. రవి, అనంతపురం.



అనగనగా ఓ హంస. ఆ హంస ఒకసారి ఓ చక్కని చెరువులో ఈత కొడుతూ తిరుగుతున్నది, తోటి హంసలతో బాటు.

సరిగ్గా ఆ సమయానికే అ దేశపు మహారాజు ఏదో పని మీద వెళుతూ ఉన్నాడు ఆ త్రోవలో. వెళుతూ వెళుతూ దాహం తీర్చుకోవటంకోసం ఆయన చెరువులోకి దిగాడు.

ఆయన్ని చూడగానే హంసలన్నీ ఎగిరిపోయాయి- కానీ మన హంస మాత్రం, పరధ్యానంలో ఉండి రాజు దగ్గరకే ఎగిరి

వచ్చి, ఆయన చేతచిక్కింది.

ఆ మహారాజు కూడా పాపం మంచివాడు- ఆ హంసను ఏమీ చేయలేదు. ఊరికే దాని రెక్కలను దువ్వి విడిచి పెట్టేశాడు.

దానికి ఆ హంస చాలా ఆనందపడి "ఓ మహారాజా! నీ చేత చిక్కినా కూడా నాకు ఏ ఆపదా కలిగించకుండా విడిచి పెట్టావు. అందుకు కృతజ్ఞతగా నేను నీకొక సహాయం చేస్తాను. మా దేశంలో మహారాజుకు ఓ కుమార్తె ఉంది.



ఆ అమ్మాయి చాలా చక్కనిది, మంచిది, అనేక శాస్త్రాలు చదివింది. నువ్వూ మంచివాడివే కనుక, నేను ఏం చేస్తానంటే- ఆమెకు నీ గురించి చెబుతాను. ఎలాగైనా ఆమెకు నువ్వంటే ఇష్టమయ్యేలా చేస్తాను. మరి నువ్వు కొన్ని రోజుల తర్వాత మా దేశానికి వచ్చి ఆ అమ్మాయిని పెళ్ళాడు!" అన్నది. రాజు అంగీకరించాడు.

ఆ హంస అన్నంత పనీ చేసింది. తమ దేశపు యువరాణి దగ్గరకు వెళ్ళింది. ఆ యువరాణికి అందకుండా పరిగెత్తింది, మళ్ళీ ఆమె చేతికి చిక్కింది, ఆమెను మురిపించింది, ఆపైన 'త్ర-త్ర' అనుకుంటూ ఇట్లా మాట్లాడింది:

సహస్ర పత్రాసన పత్రహంస వంశస్య పత్రాణి పతత్రిణః స్మ !
అస్మాదృశాం చాటురసామృతాని స్వర్లోకలోకేతరదుర్లభాని

"అమ్మాయీ! నేను బ్రహ్మవాహనమైన హంసల కుటుంబానికి చెందిన దాన్ని. నేను మాట్లాడే చమత్కారమైన మాటలు వినటం దేవతలకు కూడా సాధ్యంకాదు" అని దీని అర్థం.

అట్లా తన పాండిత్యంతోటి ఆమెను మెప్పిస్తూ, మెల్లగా మాటలు కలిపింది; తను మాట యిచ్చిన మహారాజు రూప లావణ్యాల గురించి, శౌర్య ప్రతాపాల గురించి చెప్పింది;

ఇలా చక్కటి దూతగా తన పని చేసింది.

ఆపైన ఆ మహారాజు, వీళ్ల రాజ్యానికి రావటం, స్వయంవరంలో పాల్గొని యువరాణిని పెళ్ళాడటం జరిగిపోయింది!

ఆ మహారాజు పేరు నలుడు. యువరాణి దమయంతి!

ఈ కథలో హంసను చేర్చి, అందంగా తీర్చిన కవి పేరు 'శ్రీహర్షుడు'. ఆయన సంస్కృతంలో వ్రాసిన కావ్యం పేరు 'నైషధీయచరితమ్'.

ఈ కావ్యాన్నే కవిసార్వభౌముడైన శ్రీనాథుడు 'శృంగారనైషధమ్' అన్న పేరుతో తెలుగులోకి అనువదించాడు.

పద్యం

పలుచని హీనమానవుడు పాటిదలంపక నిష్ఠురోక్తులన్
బలుకుచునుండుగాని మతిభాసురుడైన గుణప్రపూర్ణుడ
ప్పలుకుల బల్కబోవడు నిబద్ధిగ; నెట్లన, వెల్తి కుండ దా
దొలుకుచునుండుగాని, మరి దొల్కునె నిండు ఘటంబు, భాస్కరా?


తక్కువ రకం వాడు ఉచితానుచితాలు తెలియక వదరుతుంటాడు కానీ, జ్ఞాని, సద్గుణవంతుడు అయినవాడు అట్లా ఇష్టం వచ్చినట్లు మాట్లాడడు. ఏ విధంగానంటే, వెలితి ఉన్న కుండ ఎప్పుడూ తొణుకుతుంటుంది కానీ, నిండుకుండ తొణకదు కదా?



క్రాంతి రైలు పట్టాలపై అడ్డంగా పడుకున్నాడు.

రవి: ఒరేయ్.. రైలు వస్తే ఏం చేస్తావు?

క్రాంతి: ఓరి పిరికిపందా.. కొంచెం సేపు కిందటే నామీద నుండి విమానం వెళ్ళింది. నాకు ఏమీ కాలేదు. ఇక రైలొక లెక్కా...?



మారిన వయసు

వయసు తగ్గాలని కొందరు పడే తపన అంతా ఇంతా కాదు. కానీ ఆ రష్యన్ కథలో మాదిరి ఉంటారు కొందరు- ఇస్తానన్నా మరో జీవితం వద్దంటారు! చదవండి మరి...

రచన: శ్రీ చొప్ప వీరభద్రప్ప, అనంతపురం.

ముసలి కొమరప్ప కిరాణా కొట్టులో పనిచేసేవాడు. చివరికి ఒకరోజున యజమాని అతనితో "చూడు కుమరప్పా, నీకు ఇప్పుడు కళ్ళు సరిగా కనపడట్లేదు; చెవులు సరిగా వినపడట్లేదు; చెప్పిన పనులు సరిగా చేయట్లేదు. నువ్వు ముసలివాడివి ఐపోయినావు; ఇంక వల్ల కాదు గానీ, విశ్రాంతి తీసుకో" అని చేతిలో కొంత డబ్బు పెట్టి, పని నుంచి తీసేసి, ఇంటికి పంపాడు.

తను ముసలివాడైపోయిన సంగతి కొమరప్పకు తెలుసు. యజమాని తనని తీసేసినందుకు అతనేమీ నిర్ఘాంతపోలేదు కానీ, కొంత చిన్నబోయాడు. "పని లేకపోతే భవిష్యత్తు లేదు- అయినా యజమాని తప్పు

కూడా ఏమున్నది ఇందులో..?! తనకు వయసు ఎక్కువైంది; శక్తి ఉండట్లేదు; పని చేయలేకపోతున్నాడు.." ఇట్లా రకరకాలుగా పోయినై, అతని ఆలోచనలు.




అట్లా ఆలోచించుకుంటూ ఇంటికి వస్తుంటే, దారిలో ఒక ఇంటి ముందు చాలామంది గుమిగూడి ఉండటం కనిపించింది అతనికి. షావుకారు గారి మనుషులు కొందరు ఆ ఇంట్లోని సామానులు బయటికి విసిరేస్తూ నానా రభసా చేస్తున్నారు. ఆడవాళ్ళు గట్టిగా ఏడుస్తున్నారు. అప్పు చేసిన ముసలాయన తలవంచుకుని ఇంటి బయట, షావుకారు ముందు నిలబడి ఉన్నాడు. ఆ ముసలాయన కొమరప్పకు దగ్గరి బంధువు. చూడగానే సంగతి తెలిసిపోయింది కొమరప్పకు.

దాంతో ఇంక ఆగలేక, అతను వాళ్ల దగ్గరికి వెళ్ళి, వివరాలు తెలుసుకొని, తన చేతిలో ఉన్న డబ్బంతా షావుకారుకు ఇచ్చేసి, గొడవను సర్దుబాటు చేసాడు. ఆపైన ఒట్టి చేతులతో ఇంటికి వచ్చి, జరిగిన విషయం అంతా చెప్పాడు భార్య కుమరమ్మతో.

కుమరమ్మ ఉత్తమురాలు; భర్తకు చేదోడు వాదోడైనది. ఆమె భర్తను తిట్టలేదు. పైగా మెచ్చుకుని, "పోతే పోయిందిలే, పాడు డబ్బు. కష్టాల్లో ఉన్నవాళ్లని ఆదుకోకపోతే ఇంక ఆ డబ్బెందుకు, బంధుత్వాలెందుకు?!" అనేసింది.

అయితే వాస్తవం కఠోరంగా ఉంటుంది. కొన్నాళ్ళు గడిచేసరికి వాళ్లకు ఇల్లు జరగటంలో కష్టం తెలిసి వచ్చింది. ముసలి భార్యాభర్తలు ఇద్దరూ చిన్న చిన్న కూలి పనులు చేస్తూ, చాలీ చాలని ఆదాయంతో,

ఒంటి పూట తింటూ కాలం వెళ్లబుచ్చాల్సి వచ్చింది.



ఒక రోజున ఉదయాన్నే వంటచెరకు కోసం దగ్గరలో ఉన్న అడవికి పోయాడు కుమరప్ప. కట్టె పుల్లల కోసం అడవంతా తిరిగాడు; చాలా అలసిపోయాడు. ఆకలిగా ఉంది- రాత్రంతా ఏమీ తిని ఉండలేదు. చివరికి పుల్లలు మోపు కట్టుకునే సరికి అతని కళ్ళు తిరిగినై; అక్కడికక్కడే పడి మూర్ఛ పోయాడు.

సాయంత్రం అయినా మెలకువ రాలేదతనికి. చీకటి విస్తరిస్తూంది. అతను వచ్చినప్పటి నుండీ అతన్నే గమనిస్తున్న కుందేళ్ల జంట ఒకటి మెల్లగా అతని దగ్గరకు వచ్చింది. ఒక కుందేలు అతని ముఖం మీదికి ఊదింది. రెండోది అతని చేతులు పట్టుకొని ఊపింది. కుమరప్పలో ఎలాంటి చలనమూ లేదు.

అప్పటికే క్రూర జంతువుల సంచారం మొదలైంది. ఆగి ఆగి వాటి అరుపులు వినిపిస్తున్నాయి. నక్కలు కూడా కూస్తున్నాయి.



కుందేళ్ళు ఏమనుకున్నాయో, ఏమో; రెండూ చకచకా ఆకులు-అలములు తెచ్చి అతనిమీద పోసి అతన్ని కప్పేసాయి.

అక్కడే తిరుగుతూ ఉండిన ఉడుత ఒకటి, వాటికి సాయపడింది. ఆ ప్రక్కనే చెట్టుమీద

కూర్చున్న నెమలి అవి జంతువులు చేసే పనిని చూస్తూ , నక్కలు-తోడేళ్ళ సంచారాన్ని గమనిస్తూ, వాటికి హెచ్చరికలు అందించింది.

తెల్లవారింది. అతను మేలుకున్నాడు.



కుందేళ్లు ఎర్రగా మాగిన పండునొకదాన్ని తెచ్చి అతని ముందుంచినై. ఉడుత పిల్ల తన వంతుగా చిన్న పండు ఒకటి తెచ్చి అతని ముందు ఉంచింది. నెమలి ఏవో ఆకుపచ్చ ఆకులు మూడింటిని తెచ్చి అతని ముందు వేసింది.

కొమరప్పకు చాలా ఆకలిగా ఉంది. చకచకా పండ్లు తినేసాడు. చూస్తూండిన నెమలి గరగరమని ఏదో శబ్దం చేసి, కాళ్ళు నేలమీద రాసింది: అతను నవ్వి, "ఓహో! నువ్వు తెచ్చిన ఆకులు కూడా తినాలా?! సరే" అని నవ్వుకుంటూ ఆ ఆకుల్ని కూడా తినేసాడు.

ఆకులు తియ్యగా ఉన్నాయి. వాటితోటి కొమరప్ప ఆకలి తీరింది. దాహం తగ్గింది. నిద్ర ముంచుకొచ్చింది.

మరుసటి రోజు వరకూ తెలివి లేదు అతనికి. మేలుకోగానే అవి పండ్లు, ఆకులు తెచ్చి ఇచ్చాయి. అతను వాటిని తినేసి నిద్రపోయాడు మళ్ళీ.

మూడవ రోజు కూడా అంతే జరిగింది.

అయితే అతనికి ఆరోజు సాయంత్రానికల్లా మెలకువ వచ్చేసింది. అతన్ని చూసి నెమలి, ఉడత, కుందేళ్ళు సంతోషంతో గంతులు వేశాయి.

ఇప్పుడతనికి మత్తు వదిలింది. ఆకలి తీరింది. సత్తువ కూడా బాగా వచ్చింది. వాటికి ధన్యవాదాలు చెప్పుకొని, కట్టెల మోపును నెత్తిన పెట్టుకుని సంతోషంగా ఇంటికి బయలుదేరాడు.

అతను ఇల్లు చేరేటప్పటికి చీకటిపడింది. కొమరప్ప తలుపు తట్టగానే తలుపు తీసిన కుమరమ్మ అతడిని వింతగా చూస్తూ "ఎవరు నాయనా, నువ్వు? ఏం కావాలి?" అని అడిగింది.

కుమరయ్య కోపంగా "ఏమే! గుర్తుపట్టలేదా?! ఎకసెక్కాలు ఆడుతున్నా-వా?!" అనగానే ఆమె అతడి స్వరం గుర్తుపట్టి ఆమె ఆశ్చర్యంతో నోరు తెరిచింది!!

"ఏమయ్యో! ఎక్కడికి పోయినావు, ఇన్ని రోజులు? ఎందుకయ్యా, నువ్వు ఇట్టా అయినావు?" అనటం మొదలు పెట్టింది.

అతను బిత్తరపోతూ "ఏమైనానే?! నాకేమైతాది?" అనగానే ఆమె ఇంక మాట్లాడకుండా ఇంట్లోకి పోయి, అద్దం తెచ్చి చూపించింది:

కొమరప్ప తనని తాను గుర్తు పట్టలేకపోయాడు! తను పూర్తిగా యువకుడైపోయాడు! అందుకేననమాట, తను కట్టెలమోపును అవలీలగా తేగలిగింది!

అతను అబ్బురపడుతూ ఈ మూడు రోజుల్లోనూ ఏం జరిగిందో చెప్పాడు కుమరమ్మకు. అంతా విని ఆమె నవ్వి "బాగుందిలే మన జోడీ: నువ్వు యువకుడివి; నేను ముసలిదాన్ని! ఇప్పుడు మనల్ని ఎవరైనా చూస్తే నవ్విపోతారు. కానీ ఏంచేస్తాం?!" అంది.



కొమరప్ప కొంచెం ఆలోచించి "కాదులే, రేపు ఉదయం నువ్వూ రా. నీకు ఆ తావు చూపిస్తా. ఆ కుందేళ్లు, ఉడత నెమలి ఇంకా అక్కడే ఉండచ్చు" అన్నాడు.

తెల్లవారగానే ఇద్దరూ బయలుదేరి అడవిలోకి వెళ్ళారు. వాళ్లని చూడగానే కుందేళ్ళు,

ఉడత, నెమలి దగ్గరికొచ్చి పలకరించాయి. కుమరమ్మ చుట్టూ తిరిగి, ఆమెకు కూడా పళ్ళు, ఆకులు తెచ్చి ఇచ్చాయి.

మూడు రోజులు గడిచే సరికి కుమరమ్మ కూడా అందమైన యువతిగా మారిపోయింది! ఇద్దరూ తలా ఒక కట్టెల మోపు ఎత్తుకొని ఇల్లు చేరారు.

వాళ్ళను చూసి అందరికీ ఆశ్చర్యమైంది. "ఎట్లా జరిగింది, ఇలా?" అని అడిగినవాళ్ళందరికీ "మేము చచ్చిపోవాలని అడవిలోకి వెళ్ళి, కనిపించిన ఆకులు అలములు తిన్నామా, తినగానే ఇట్లా అయిపోయినాం!" అని చెప్పారు వాళ్ళు. కొందరు నమ్మారు; కొందరు నమ్మలేదు. అయినా ఇప్పుడు ఇద్దరూ కుర్రవాళ్ళే కాబట్టి, ఇద్దరికీ పని దొరికింది, మళ్ళీ వాళ్ల సంసారం సజావుగా సాగిపోసాగింది.

ఈ సంగతి షావుకారికి తెలిసింది. అతడు వచ్చి వీళ్ల నెత్తిమీద కూర్చున్నాడు "మీరు తిన్నలాంటి పండ్లు, ఆకులు నాక్కూడా తెచ్చి ఇవ్వండి" అంటూ.

"అయ్యో, అవి ఎక్కడున్నాయో కూడా మాకు తెలీదు- కుందేళ్లు, ఉడత, నెమలి తెచ్చి ఇచ్చాయి మాకు" అని నోరుజారాడు కుమరప్ప. దాంతో షావుకారు వీళ్ళను బెదిరించి, పూర్తి సమాచారం బయటికి లాగాడు.

"ఓహో! ఇదన్నమాట, సంగతి!" అని అతను కొమరప్ప దుస్తులు వేసుకొని, ఆ గుర్తుల ప్రకారం అడవిలోకి పోయాడు.

అతన్ని చూడగానే అడవిలో పక్షులు-జంతువులు అన్నీ భయపడ్డాయి. అయినా కొమరప్ప మీది అభిమానంతో అతనికి కూడా మూడు రోజుల పాటు పండ్లు, ఆకులు తెచ్చి ఇచ్చాయి.

అట్లా మూడు రోజులు గడిచే సరికి ముసలి షావుకారి కాస్తా మధ్య వయసువాడు అయిపోయినాడు. చివరి రోజున నిద్ర లేవగానే, అతను తన దగ్గరికి వచ్చిన కుందేళ్లనీ, ఉడతనీ, నెమలినీ అక్కడినుండి తరిమేసి, ఆ చుట్టుప్రక్కల అంతా వెతుక్కున్నాడు. కొద్ది సేపటికే అతనికి

అట్లాంటి పళ్ళు, ఆకులు ఉన్న చెట్లు కనిపించాయి. వాటిలోంచి అందినన్ని ఆకులు మూట కట్టుకుని, అతను గబగబా ఇల్లు చేరుకున్నాడు.



ఇంటికి వచ్చి అద్దం చూసుకున్నాక, అతను సంతోషపడలేదు; ఏడుపు ముఖం పెట్టాడు- “నాకు మధ్యవయసే ఎందుకు వచ్చింది? ఇంకా కుర్రవాడిని కావాలి!" అని.

షావుకారు భార్య మంచిది. దురాశ పూనిన తన భర్తను చూసి ఆమె బాగా నవ్వింది. “ఎక్కువ ఆకులు తింటే ఇట్లా అయిపోతారేమో. మీరు కొన్ని తక్కువ ఆకులు తిని ఉండాల్సింది" అన్నది.

అయినా షావుకారి "ఇవన్నీ తింటే నేను ఇరవై ఏళ్ళ కుర్రవాడినైపోతాను" అంటూ తను తెచ్చిన ఆకులు, పండ్లు అన్నీ ఒకేసారి తినేసాడు! ఆ వెంటనే మూడు రోజులపాటు గాఢనిద్ర క్రమ్ముకున్నది అతనికి! లేచి చూసే సరికి, అతను కాస్తా పండు ముసలివాడు ఐపోయి ఉన్నాడు!

దాంతో షావుకారు పరుగు పరుగున కొమరప్ప దగ్గరకు వెళ్ళి, "నా ఆస్తులన్నీ రాసిస్తా; నీ మిత్రులకెవరికో చెప్పి ఈ ముసలితనం ఒక్కటీ పోగొట్టు!" అని కాళ్ళావేళ్ళా పడ్డాడు.

కొమరప్ప, అతన్ని పట్టుకొని అడవంతా తిరిగాడు గానీ, ఎంత వెతికినా ఇంక ఆ జంతువులు, ఆ మొక్కలు ఇంక అసలు కనబడనే లేదు!!

అట్లా ముసలి షావుకారు మరింత ముసలివాడైపోయాడు. కొత్తగా వచ్చి పడిన ముసలితనంతో కొంత, అవమానభారంతో ఇంకొంత కృంగిపోయాడు.



తోలు తిన్న కుక్కలు

బౌద్ధ కథ

అనుసరణ: నారాయణ, కొత్తపల్లి

మూలం: "జాతక టేల్స్" - ఫ్రాన్సిస్ & థామస్

బ్రహ్మదత్తుడు కాశీ రాజ్యాన్ని పరిపాలిస్తున్న రోజుల్లో బోధిసత్త్వుడు ఒకసారి ఒక కుక్కగా జన్మించాడు. బలంగా, నిండుగా ఉండిన ఆ కుక్క, వందలాది కుక్కలకు నాయకుడిగా ఉండేది. వాటి దండు అంతా నగరంలోని పెద్ద స్మశానంలో నివసించేది.

ఒకనాడు రాజుగారు ఎప్పటి మాదిరే తెల్లటి గుర్రాలతో పూన్చిన రథం ఎక్కి నగర సంచారం చేసి, సాయంత్రం చీకటి పడుతుండగా తిరిగి వెనక్కి చేరుకున్నాడు. ఆయన ఎక్కి వచ్చిన రథాన్ని రాజ ప్రాసాదం బయటనే నిలిపి ఉంచారు భటులు. గుర్రాలకు వేసే జీను, కళ్లాలు మొదలైన తోలు వస్తువులన్నీ రథంతో పాటు అక్కడే ఉండిపోయాయి. ఆ రోజు రాత్రి వాన కూడా కురిసింది; దాంతో అవన్నీ బాగా నానాయి.

రాజుగారి కోటకి ఒక వైపున, గోడ మధ్యలో

సన్నని సందు ఉండేది. చీకటిపడ్డాక, ఊళ్లో కుక్కలు కొన్ని ఆ సందులో నుండి కోట లోపలికి దూరి, ఆహారాన్ని వెతుక్కునేందుకు అలవాటు పడ్డాయి.



అయితే రాజుగారి రథం ఆలస్యంగా కోటలోకి పోవటాన్ని, ఆపైన వాన పడటాన్ని గమనించిన బోధిసత్వుడు తోటి కుక్కలతో "ఒరే! ఇవాళ్ల రాజుగారు ఆలస్యంగా ఇల్లు చేరారు. పనివాళ్ళు ఆయన వస్తువుల్ని వేటినో బయటనే వదిలిపెట్టి ఉండొచ్చు. దానికి తోడు ఇవాళ్ల వాన కూడా పడింది- కాబట్టి నేను చెబుతున్నాను; ఈ రోజున మీరెవరూ కోటలోకి పోకండి- పోతే ప్రమాదం!" అని, బయటి కుక్కలేవీ ఆ రోజున కోటలోకి పోకుండా అడ్డుకున్నాడు.

అయితే కోట లోపల కాపలా ఉండే రాజుగారి ఆస్థాన కుక్కలకు అడ్డు ఏమున్నది? అవి యదేచ్ఛగా తిరుగుతూ, రాజుగారి రథానికి తగిలించి ఉన్న జీనులు, కళ్లాలు, రథపు మెత్తలు మొదలైన తోలు వస్తువులను అన్నిటినీ రాత్రంతా నమిలి, ముక్కలు చేసి ఎంచక్కా తిని పోయాయి!

తెల్లవారాక రథపు దుర్దశను గమనించిన భటులు నాలుకలు కొరుక్కొని, "మహా ప్రభూ! ఊరి కుక్కలు దొంగతనంగా లోనికి ప్రవేశించి, దొరికిన వస్తువునల్లా పాడు చేస్తున్నాయి. నిన్నటి రాత్రి తమరి రథాన్ని కూడా తుక్కు తుక్కు చేశాయి" అని ఫిర్యాదు చేశారు.

రాజుగారికి చాలా కోపం వచ్చింది. వెంటనే "కనిపించిన ఊరకుక్కనల్లా చంపేయండి" అని ఆదేశించాడు. వెంటనే భటులు ఊరంతా తిరుగుతూ కనిపించిన కుక్కనల్లా వలలతో బంధించి, వధ్యశాలకు తీసుకుపోవటం మొదలుపెట్టారు.



వాళ్ల చేతికి ఇంకా చిక్కని ఊర కుక్కలన్నీ బోధిసత్త్వుడుండే స్మశానానికి చేరుకొని, "అయ్యా! తమరు ముందుగానే హెచ్చరించారు కదా, ఆ ప్రకారమే మేం ఎవ్వరమూ నిన్నటి రాత్రి కోటలోకి అడుగు పెట్టలేదు. అయినా 'తన రథపు తోలు వస్తువులన్నీ నమిలివేసింది మేమే' అన్న అనుమానంతో రాజుగారు మమ్మల్ని అందరినీ చంపేందుకు సమకట్టారు. భటులు ఊరకుక్కల్ని వందల సంఖ్యలో పట్టుకొని పోతున్నారు. మన జాతికి పెను విపత్తు వాటిల్లింది. మీరే ఏదైనా చేయాలి" అని మొరపెట్టుకున్నాయి.

"బయటి కుక్కలేవీ లోనికి పోలేదు- కాబట్టి ఈ పని చేసింది ఖచ్చితంగా కోటలో ఉన్న రాజుగారి కుక్కలే. అసలైన నేరస్థులు సుఖంగా ఉండగా, అమాయకులైన జీవులకు శిక్ష పడుతున్నది. ఇది తప్పు. నేరస్థులను రాజుకు పట్టించి, అమాయకుల ప్రాణాలను కాపాడుతాను" అని నిశ్చయించుకున్నాడు బోధిసత్త్వుడు.

"భయపడకండి. మీరంతా నేను తిరిగి వచ్చేవరకూ ఇక్కడే ఉండండి" అని వాటి పట్ల కరుణతో నిండిన చిత్తంతో, పది రకాలైన చైతన్యాలను స్మరించుకొని, బోధిసత్త్వుడు ఒక్కడే- నగర వీధులగుండా నడుస్తూ- రాజు మందిరం చేరుకున్నాడు. బోధిసత్త్వుని ఉన్నత ఆశయానికి అనుగుణంగా దారిలో ఏ భటుడూ అతనిపై చేయి ఎత్తలేదు.

బోధిసత్త్వుడు నేరుగా రాజసభకు చేరి, అక్కడ కొలువుదీరిన బ్రహ్మదత్తుడి ముందుకు పోయి నిలబడ్డాడు. అతన్ని అడ్డుకునేందుకు అక్కడ చేరిన వారెవ్వరికీ

చేతులు రాలేదు.



బోధిసత్త్వుడు రాజుకు నమస్కరిస్తూ, మానవ స్వరంతో "ఓ రాజా! ఊళ్లోని కుక్కలన్నిటినీ చంపమని ఆదేశించింది నువ్వేనా?!" అని అడిగాడు.

"అవును-నేనే!" అన్నాడురాజు.

"అవి చేసిన నేరం ఏమిటి?"

"నా రథాన్ని అవి పాడు చేసాయి"

"ఆ పని చేసిన కుక్కలు ఏవో నీకు స్పష్టంగా తెలుసా?"

"లేదు- తెలీదు"

"అయితే మహారాజా! అసలు నేరస్థులు ఎవరో తెలీకుండానే, కనపడిన ప్రతి ఊరకుక్కనల్లా చంపమనటం ధర్మం కాదు"

"కుక్కలు నా రథాన్ని పాడుచేసాయి, కాబట్టి కుక్కలన్నింటినీ నిర్మూలించమని నేను ఆజ్ఞాపించాను"

"తమరి భటులు అన్ని కుక్కల్నీ చంపుతున్నారా, లేక కొన్నింటిని వదిలి పెడతారా?"


"మా రాజప్రాసాదంలోని మేలు జాతి కుక్కల్ని తప్ప, మిగిలిన వాటినన్నింటినీ భటులు నిర్మూలిస్తారు"

"రాజా! 'కుక్కలు నేరం చేసాయి, కాబట్టి వాటిని అన్నింటిని నిర్మూలించాలి' అని పూనుకున్న మీరు, ఆ తర్వాత 'మా ప్రాసాదం లోపల ఉండే కుక్కల్ని మటుకు బ్రతకనిస్తాను' అనటం తప్పు కదా?! 'పక్షపాతం, అయిష్టం, అజ్ఞానం, భయం'- అనే నాలుగు అధర్మ మార్గాలకూ మీ ఆలోచన దోహదం చేస్తున్నది. అటువంటి నిర్ణయాలు తప్పు. రాజులకి తగినవి కావు. న్యాయ నిర్ణయం చేసేటప్పుడు. తక్కెడపైన

ముల్లు మాదిరి- రాజు స్థిరంగా, పక్షపాత రహితంగా నిలవాలి. కాని మీ ఈ నిర్ణయం అమాయకులైన కుక్కలకు విపత్కరంగా మారటమే కాక, అసలు తప్పు చేసిన వాటిని పూర్తిగా వదిలి వేస్తూన్నది" అన్నాడు బోధిసత్వుడు గంభీరంగా.

"ఇతనెవరో కుక్క వేషంలో వచ్చిన బోధిసత్వుడే తప్ప మరొకడు కాదు" అని నిశ్చయించుకున్న రాజు, గౌరవ పురత్సరంగా సింహాసనం దిగి నిలబడుతూ "అయ్యా! మీరు చెప్పిన మాటలు యుక్తియుక్తంగా ఉన్నాయి. కానీ ఒక సంగతి చెప్పండి- మాకు ఇలా నష్టం కలిగించిన కుక్కలు ఏవో మీకు తెలుసా?" అన్నాడు.


"రాజా! నా సలహాను అనుసరించి, బయటి కుక్కలేవీ నిన్నటి రోజున మీ కోటలోకి ప్రవేశించలేదు. కాబట్టి ఈ పనిని చేసింది మీరు పెంచుకునే మేలుజాతి కుక్కలే తప్ప వేరు కాదు. అయినా ఊహలు అవసరం లేదు. ఈ ఊరి చెరువుల్లో ఏపుగా పెరిగే 'కుశ'గడ్డిని, చిలికిన మజ్జిగను తెప్పించారంటే, వాస్తవం ఏంటో మీకు తెలిసేటట్లు చేస్తాను" అన్నాడు బోధిసత్వుడు.



రాజుగారి ఆదేశాన్ని అనుసరిస్తూ, మహల్‌లోని కుక్కలన్నింటినీ అక్కడికి తెచ్చి, వాటిచేత ఆ గడ్డిని నమిలించి, మజ్జిగ త్రాగించారు భటులు. దాని ప్రభావం వల్ల అవన్నీ వాంతులు చేసుకున్నాయి. ఆ వాంతుల్లో అవి నమిలిన తోలు ముక్కలు, ఇంకా అరగకుండా ఉన్న ఇతర పధార్థాలు అన్నీ బయటపడ్డాయి!

తన తప్పును గుర్తించిన రాజుగారు సిగ్గుతో తలవంచుకొని, బోధిసత్వుడికి చేతులు

జోడిస్తూ, "తమరు నా కళ్లు తెరిపించారు. అజ్ఞానంతో ఘోరమైన పాపం మూట కట్టుకునే వాడిని" అంటూ రాచరికానికి గుర్తుగా తాను ధరించే ఛత్రాన్ని బోధిసత్వుడికి సమర్పించుకున్నాడు.



"రాజులు న్యాయాన్ని, ధర్మాన్ని నిలపాలి. అందుకుగాను పక్షపాత రాహిత్యాన్ని, సునిశిత బుద్ధిని, కరుణను ఆశ్రయించాలి" అంటూ బోధిసత్వుడు ఐదు రకాలైన ధర్మ సూత్రాలను రాజుకు ఉపదేశించాడు.

అటుపైన రాజు "ప్రాణులన్నింటినీ కాపాడటం మనుషుల ధర్మం" అని, "కుక్కలు మొదలైన జీవులకు తగినంత ఆహారాన్ని మనుషులే ఇవ్వాలి" అనీ ఆదేశించాడు.


జీవితాంతం రాజధనాన్ని 'దాన-దయా-శీల' కార్యకలాపాలకోసం, మంచిని పెంచే ఇతర కార్యక్రమాలకోసం వెచ్చించాడు.

బోధిసత్వుడు కూడా చాలా ముసలితనం వచ్చేవరకు ఆ శరీరంలో ఉండి, అటుపైన తన కర్మలకు తగిన లోకాలకు చేరుకున్నాడు.

పద్యం

ఐకమత్యమొక్క టావశ్య కం బెప్డు
దాని బలిమి నెంతయ్యైన కూడు
గడ్డి వెంటి బెట్టి కట్టదా యేనుంగు
విశ్వదాభిరామ వినురవేమ

భావము: ఓ వేమా! అందరూ ఒక్కటిగా కలసిమెలిసి ఉండటం చాలా అవసరం. పురి పెట్టిన గడ్డి తాడుగా మారి ఏనుగును సైతం కట్టివేస్తుంది కదా!? అలాగే, ఐకమత్యం వల్ల ఎంత పనైనా నెరవేరుతుంది.



మానవతా నిలయం

రచన : మద్దిరాల శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, ZPHS కంకణాలపల్లి, ప్రకాశం జిల్లా.

మైనంపాడు గ్రామంలోని ఉపాధ్యాయ శిక్షణా సంస్థలో 25 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థులంతా ఆ రోజున "గెట్ టుగెదర్" ఏర్పాటు చేసుకున్నారు. ఆ "ఆత్మీయ కలయిక" లో అందరూ తమ అనుభవాలను నెమరు వేసుకున్నారు.

వాళ్ళు అక్కడ చదివిననాడు పని చేసిన ఉపాధ్యాయులందరూ విచ్చేసారు. అందరూ మాట్లాడాక, ప్రిన్సిపాల్ చౌదరి గారు చెప్పారు, మనసుకు హత్తుకునేట్లుగా: "మీరంతా జీవితంలో చాలా ఎదిగారు. మీలో చాలా మంది టీచర్లయ్యారు. మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించారు. అట్లాంటి మీనుండి నేను ఆశించేది ఒకటి ఉన్నది:

అదిగో, అక్కడ- వేదిక వెనుకవైపున బ్యానర్‌లో మీరు ఏర్పాటు చేసిన సూక్తి ఉన్నదే, "మహోన్నత విజయాల కన్నా మానవత్వపు విలువలు మిన్న!" అని- అది నాకు చాలా నచ్చింది. మీరంతా మరెన్నో విజయాలను సాధించండి- అయితే మీ జీవితాలలో ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా సరే, మానవత్వపు విలువలను మాత్రం మరువకండి. అంతేకాదు- మానవులుగా సమాజం పట్ల మీకు ఉన్న బాధ్యతను నెరవేర్చండి. మీకు సమాజం చాలా ఇచ్చింది. ఆ ఋణాన్ని మీరు తీర్చుకునేందుకు శక్తివంచన లేకుండా ప్రయత్నించండి" అని.

ఆయన మాటలు విద్యార్థులందరిలోనూ స్ఫూర్తిని ఇంకా పెంచాయి. ఎవరికి వాళ్ళు ఆయన మాటల్నే గుర్తు చేసుకుంటూ స్వస్థలాలకు ప్రయాణమయ్యారు.

వాళ్ళలో ఒకడు- ఎన్నారై పరశురామ్- తను ఆ రాత్రికి అక్కడే ఒక మిత్రుని వద్ద బస చేశాడు. మరుసటి రోజు తన కారులో తిరుగు ప్రయాణమయ్యాడు. కారు రోడ్డు మీద పరుగులు తీస్తుంటే, మనసు ప్రిన్సిపల్ గారి మాటలమీదికి మళ్ళింది... 'నేను ఇప్పటికి చాలా డబ్బు సంపాదించాను. కానీ మంచిపనులు ఎన్ని చేసాను? ఆయన అన్నట్లు, నిజంగా ఏదైనా ఒక మంచి పని చేయాలి. ఏం చేస్తే బాగుంటుంది?' అని.

అంతలో కారు ఆగింది- "డ్రైవర్! ఎందుకు కారు ఆపావు?'' అంటూ ఈ లోకంలోకి వచ్చాడు పరశురామ్.

"ట్రాఫిక్ సిగ్నల్ సర్" డ్రైవర్ సమాధానం.

చుట్టూ చూశాడు పరశురాం. అది బెంజిసర్కిల్ సెంటర్. ట్రాఫిక్ చాలా ఉంది. "ఓహో! విజయవాడ వచ్చేశామా!" అనుకున్నాడు.

అంతలో ఒక బిచ్చగత్తె కారు కిటికీ మీద టకటకా కొట్టింది వ్రేళ్లతో. ఆమె చంకలో చిన్న బిడ్డ ఉన్నాడు. "ధర్మం చేయండి బాబూ!" దీనంగా అడిగింది.

పరశురామ్‌కు బిచ్చం వేయటం ఇష్టం లేదు.

అడుక్కునే వాళ్ళంటే తనకు పడదు.



కిటికీ అద్దం క్రిందికి జార్చి, "కాళ్ళూ చేతులూ బాగానే ఉన్నాయిగా?! ఏదైనా పని చేసుకోలేవూ?! వెళ్ళు..వెళ్ళు.." అంటూ కోప్పడ్డాడు.

గొణుక్కుంటూ వెళ్ళింది బిచ్చగత్తె. పావుగంట గడిచింది. ఇంకా గ్రీన్ సిగ్నల్ పడలేదు.

"ష్! అబ్బా, ఈ బెంజి సర్కిల్‌లో ఎప్పుడూ ఇంతే- ఎంతసేపు ఆగాల్సి వస్తుందో ఎవరికీ తెలీదు" విసుక్కున్నాడు పరశురాం. అంతలోనే మరో చిన్న పిల్లవాడు వచ్చాడు కారు దగ్గరికి.

వాడికి నిండా పదేళ్ళు కూడా లేవు; అడుక్కుంటున్నాడు!

"ఇంత చిన్న పిల్లవాడు అడుక్కోవటం ఏమిటి?!" అనిపించింది. బయటికి మటుకు "పోరా, పో!" అన్నది నోరు.

ఆ వెంటనే మరొకడు- ఇతనికి యాభై ఏళ్ళు దాటి ఉంటాయేమో, అంతే- ముసలి బిచ్చగాడు. ఈసారి పరశురాం కిటికీ అద్దం పైకి వేసేశాడు. అడిగి అడిగి వెళ్ళిపోయి ఉంటాడు ముసలివాడు.

గ్రీన్ సిగ్నల్ పడింది. వాహనాలు కదిలాయి. పరశురాం ఇల్లు చేరేలోగా ఇలా నాలుగైదు జంక్షన్లలో కారు ఆగింది: ఆగిన ప్రతిచోటా బిచ్చగాళ్ళ గోల...

పరశురామ్ చిరాకు తారస్థాయికి చేరింది. "ప్రతివాడికీ ఇదో సులభ సంపాదన అయిపోయింది. ఛీ..ఛీ... మొన్న పేపర్లో కూడా వేశారుగా?! హైదరాబాదులో 95% మంది డమ్మీ బిచ్చగాళ్లున్నారని?! దొంగలు! ఏదో ఒక పని చేసుకొని చావచ్చుగా?! ఏమిటో, ఈ దరిద్రపు బతుకులు?!"

అనుకుంటూ ఇల్లు చేరాడు.

ఇంట్లో తన కోసం ఎదురు చూస్తున్నాడు ఫ్రీలాన్స్ రిపోర్టర్ శేషు. "గుడ్మార్నింగ్ సర్" విష్ చేసాడు పరశురామ్‌ని.

"ఇదిగో శేషూ, నాకో పని చేసి పెట్టు, అర్జంటుగా. అసలు ఈ బిచ్చగాళ్ళు ఎవరు? ఎందుకు అడుక్కుంటారు? ఏదైనా పని ఎందుకు చేసుకోరు?" వివరంగా కనుక్కో. అన్ని గణాంకాలతోటీ, అన్ని ఇంటర్వ్యూలతోటీ వీలైనంత త్వరగా నాకొక రిపోర్టు కావాలి!" పని అప్పగించాడు.

కొద్ది రోజుల్లోనే శేషు రిపోర్టు పట్టుకొచ్చాడు- "భర్తలు వదిలేసిన అడవాళ్ళు. తల్లిదండ్రులు చనిపోయిన అనాధలు, పిల్లలు వదిలేసిన ముసలివాళ్ళు, మోసపోయిన ఆడవాళ్ళు,.. ఇలా రకరకాల వాళ్ళు బిచ్చమెత్తుకుంటున్నారు. 'మరి పని చేసుకోవచ్చు కదా?' అంటే "అందరూ ఆమాట అనే వాళ్ళే కానీ, నిజానికి పని ఇచ్చే వాళ్ళు లేరు.." రిపోర్టును చదివిన పరశురామ్ కళ్ళు చెమ్మగిల్లాయి.

"ఆదరించే వారు, పట్టించుకునే వారు, చెప్పేవారు లేక ఇలాగ అవుతున్నారు.." ప్రిన్సిపాల్ గారి మాటలు గుర్తుకొచ్చాయి పరశురామ్‌కు.

వెంటనే బాల్యమిత్రుడు విజయ్‌ని రమ్మన్నాడు. విజయవాడలోనే ఓ చిరుద్యోగి విజయ్. పరశురాం అతనికి తన ఆలోచన చెప్పాడు- "నీ కుటుంబానికి జీవితాంతం ఏ లోటు లేకుండా ఏర్పాటు చేస్తాను" అన్నాడు. విజయ్ సరేనన్నాడు.

ఆ వెంటనే నగరానికి దూరంగా ఓ ముప్పై ఎకరాల స్థలాన్ని కొన్నాడు పరశురాం. అందులో ఒక అనాధాశ్రమం కట్టడానికి కావలసిన ఏర్పాట్లు, అనుమతులు సాధించాడు. నమ్మకమైన ఒక డాక్టర్, వివిధ రంగాల ఇంజినీర్స్... డ్రైవర్...ఇలా అవసరమైన సాంకేతిక నిపుణులను ఉద్యోగులుగా తీసుకున్నాడు. విజయ్‌ని ట్రస్టీగా ఉంచి, ఆశ్రమ నిర్మాణం పూర్తి చేయించాడు. దానికయ్యే ఖర్చునంతా తనే స్వయంగా భరించాడు. పూర్తి అయిన

తర్వాత తాననుకున్న విధంగా పనిచేసేందుకు అవసరమయ్యే సామగ్రిని, వాహనాలను సిద్ధం చేసుకొన్నాడు.



పేదవారికి పలు ఉపాధి అవకాశాలను ఇచ్చే చక్కని ఆశ్రమం ఒకటి తయారైంది. విజయ్, తదితరులు అప్పటికే చాలా మంది బిచ్చగాళ్లను కలిశారు. ఆశ్రమం గురించి వాళ్లకు అర్థమయ్యే భాషలో వివరించారు. ఆశ్రమం ఇచ్చే ఉపాధి అవకాశాల గురించి, జీవన భృతి గురించి, వాహన సౌకర్యం గురించి చెప్పారు. "మీకిష్టమైతేనే రావచ్చు" అంటూ చిరునామా ఇచ్చారు.

త్వరలోనే ప్రిన్సిపాల్ చౌదరి గారి చేతులమీదుగా, విజయ్, పరశురాం ట్రస్టీలుగా "మానవతా నిలయం" ప్రారంభమైంది. ఆపైన ఎందరికో అది ఉపాధి నిలయంగా మారింది.

"మహోన్నత విజయాల కన్నా మానవత్వపు విలువలు మిన్న" అన్న సూక్తి ఆ ఆశ్రమంలోని అన్ని గదులలోనూ కనబడుతుంది!

పద్యం

ఓగునోగు మెచ్చు నొనరంగ నజ్ఞాని
భావమిచ్చి మెచ్చు బరమ లుబ్ధు
బంది బురద మెచ్చు బన్నీరు మెచ్చునా
విశ్వాదాభి రామ వినురవేమ

భావము: ఓ వేమా! మూర్ఖుడు మూర్ఖుడిని ఇష్టపడతాడు. తెలివిలేనివాడు డబ్బులిచ్చి మరీ పిసినారి వాణ్ణి సేవిస్తాడు. పంది బురదను ఇష్టపడుతుంది తప్పిస్తే సువాసనగల పన్నీరును మెచ్చదు కదా, అలాగన్నమాట!

పదాల్ని వెతికి పట్టుకోండి!

గారెలు, కషాయాలు, మట్టివాసన, దొంగలు, కృతజ్ఞతలు, పట్టుదల, సినిమాలు, పాఠశాల, మీనాక్షి, ఎన్నికలు, సైనికులు, హైదరాబాదు, యువరాజు, ఎలుక, డబ్బులు, తెలంగాణ, ఉల్లిపాయ, గొర్రెలు, రుద్రాక్ష, పక్షులు:- *ఈ పదాలన్నీ క్రింది పట్టికలో దాగున్నాయి-నిలువుగా, అడ్డంగా, వాలుగా, క్రింది నుండి పైకి -ఎటుపడితే అటు! వాటిని వెతికి వాటి చుట్టూ గుండ్రాలు* గీయండి!

తె	లం	గా	ణ	ఎ	క	లో	ల	శా	ఠ	పా	గొ
ర్రె	మ	ద్రా	జు	దొం	రా	తె	గా	జు	రా	వ	యు
ల	ట్టి	రు	త	గ	మీ	లు	పా	ద	క	ఉ	న్ని
జ్ఞ	వా	ద్రా	ట్టి	లు	బ్బు	డ	ఎ	షా	రా	పా	దు
లు	స	క్ష	క	క	నా	దొ	యా	ల్లి	కు	సి	బా
మా	న	లు	ఎ	న్ని	క	లు	ప	కృ	జు	సి	రా
ని	ఎ	ద	ద్రా	యా	ల్లి	మీ	రె	పా	గా	తె	ద
సి	హై	న	మ	లు	సై	బా	హై	గా	ఎ	ఉ	హై
కృ	మీ	నా	క్షి	క్షు	ని	బ్బు	ప	కు	మ	ప	య
న	పా	ఎ	డ	ఎ	కు	క్షు	డ	జా	ట్టు	గా	పా
చె	కృ	త	జ్ఞ	త	లు	చె	రా	ద	క	లం	ల్లి
స	ద్రా	గొ	ర్రె	లు	గ	క	ల	పా	హై	ని	ఉ

Form IV

Statement about ownership and other particulars about newspaper **Kottapalli** :

1. Place pf publication: Kottapalli Prachuranalu, 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
2. Periodicity of publication: Monthly
3. Printer's Name : Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
4. Publisher's Name: Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
5. Editor's Name: Narayana Sarma G.V.
   Nationality: Indian
   Address: 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuramu District, A.P. - 515101
6. The Names and Addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one percent of the total capital:
   Dr. Samatha Potu, President, Satya- Foundation For A Healthy Society, 'Sri Krupa', Near Bus Stand, Chennoor, Adilabad District, Telangana State- 504201

I, Narayana Sarma G.V. hereby declaere that the particulars given above are true to the best of my knowledge and belief.

Date:07-03-2018

Signature Of the publisher: Narayana

కొత్తపల్లి ప్రింటు పుస్తకాలను ఆన్‌లైన్లో ఆర్డరు చేయటం, చందాలు కట్టటం చాలా సులువు! క్రెడిట్ కార్డుల ద్వారాను, డెబిట్ కార్డుల ద్వారాను, నెట్ బ్యాంకింగ్ ద్వారా కూడా కొత్తపల్లికై డబ్బులు చెల్లించవచ్చు! అక్కౌంటు నెంబర్లు వెతుక్కునే పని కూడా లేదు! సందర్శించండి: **http://www.instamojo.com/kottapalli**

కొత్తపల్లిని మీ మిత్రులకు, మీరు చదివిన బడులకు, మీ సమీపంలోని లైబ్రరీలకు బహూకరించండి!

కథల పుస్తకాలండీ కథల పుస్తకాలు! పిల్లలు చెప్పిన కథలున్నాయ్! పెద్దలు వ్రాసిన కథలున్నాయ్!

రంగురంగుల బొమ్మలున్నాయ్! అక్కడక్కడా జోకులున్నాయ్!

ఆన్‌లైన్‌లో దొరుకుతున్నాయ్! ఇప్పుడే కొనండి! అందరికీ చెప్పండి!!!



రాబోయే 12 సంచికలకై ముందస్తు చందా:

రూ. 360/- (పోస్టేజీ మరియు యస్సెమ్మెస్ ఛార్జీలు కలిపి)

గమనిక: అచ్చయిన పుస్తకాలు ఎప్పటికప్పుడు సాధారణ పోస్టులో పంపబడతాయి.

RNI Regn No. : APTEL/2014/62705 Date Of Publishing: 15/03/2018 Postal Regn No: HDP/008/2018-2020

ఓ మనిషీ! మేలుకో!

రచన: శ్రీ పి.రామకృష్ణ, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీషు), జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రెజ్జం, గుంటూరు జిల్లా.

ఓ మనిషీ! మేలుకో!

నిన్ను నీవు తెలుసుకో..!

ఏమి చేస్తున్నావో గమనించు!

అభివృద్ధి పేరుతో అంధకారం, విజ్ఞానం పేరుతో వినాశనం..

ఆది మానవునికంటే ఉన్నతుడనంటావు, స్వార్థంతో పెనవేసుకుపోతున్నావు

ఆది మానవుడు బాగు చేయక పోయినా, ఆధునిక మానవునిలా నాశనం చేయలా!

ప్రకృతిని నీ స్వార్థంతో పాడు చేస్తున్నావు!

దారి తప్పిన నీ విజ్ఞానం, నీ జాతినే కాదు, జీవ జాతిని నాశనం చేస్తోంది.

పరుగులు తీయిస్తోంది నీ విజ్ఞానం.. నేరుగా సృష్టి పతనం వైపే

నీ మేధతో సృష్టించావు కాలుష్య భూతం- అది చేస్తోంది ఇప్పుడు విలయతాండవం!

ప్రళయం సృష్టించటానికే నువ్వు దానికి ఆజ్యం పోస్తున్నావు!

నీవు ఏది పైకి విసిరితే, అదే ఫలితం వస్తుంది పైనుండి

నీవు ఆకాశంపై పూలు వేస్తే, ఆ పూలే సువాసనతో నీ పై పడతాయి

ఆకాశం వైపు కాలుష్యం వేస్తున్నావు- ఆ కాలుష్య జ్వాలలు నిన్ను కమ్ముతున్నాయి

అభివృద్ధి పేరుతో ఫ్యాక్టరీలు- సదుపాయాల పేరుతో వాహనాలు- సుఖాల పేరుతో ఏసీలు

అన్నీ కాలుష్య భూతాలే...

ఇకనైనా మేలుకో! నిన్ను నీవు తెలుసుకో!

నీ పయనమెటో గుర్తించు! సరైన దారిలో పయనించు!

“Kottapalli” Printed and Published by Narayana Sarma on behalf of Kottapalli Prachuranalu and printed at Mudrica Offset Printers, Vijayawada and published at 1-127/A, Near MRO Office, Chennekothapalli, Ananthapuram District, AP-515101. Editor: Narayana Sarma.